రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్

వార్త





## జవహర్‌నగర్ పిహెచ్‌సికి

# నిర్లక్ష్యం జబ్బు!

★డీఎంహెచ్‌ఓ ఆకస్మిక తనిఖీ ★డ్యూటీ డాక్టర్ ఎగనామంపై సీరియస్ ★షోకాజ్ నోటీస్ జారీ ★ప్రభుత్వ ఆసుపత్రులపై రోగులకు నమ్మకం పెరిగేలా వ్యవహరించాలని సిబ్బందికి క్లాస్

**జవహర్‌నగర్, జులై 23, ప్రభాతవార్త:** జవహర్‌నగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్లక్ష్యంపై జిల్లా ఆరోగ్య శాఖ అధికారి డా. కె. ఆనంద్ దృష్టిసారించారు.. అక్కడి వైద్యాధికారి డా. విజయ్ చంద్ర ఇష్టాసారంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణల నేపథ్యంలో డిఎంఅండ్ హెచ్‌వో సీరియస్ అయ్యారు. గురువారం ఆకస్మికంగా పిహెచ్‌సిని తనిఖీ చేసి సిబ్బందికి ముచ్చెమటలు పట్టించారు. ఆసుపత్రిలో వైద్య సేవలు, ఔషధాల నిర్వహణ, రికార్డుల నిర్వహణ తదితర అంశాలను సమీక్షించారు. డా. విజయ్‌చంద్ర గత కొన్ని రోజులుగా విధులకు క్రమం తప్పకుండా హాజరు కాకపోవడాన్ని గుర్తించారు. రోగులకు అందించాల్సిన సేవల విషయంలో నిరక్ష్యంగా వ్యవహరించినట్లు నిర్ధారిస్తూ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. వెంటనే తన కార్యాలయానికి హాజరై వివరణ ఇవ్వాలని విజయ్‌చంద్రకు షోకాజ్ నోటీస్ జారీచేశారు. అనంతరం క్షయవ్యాధి (టీబీ) మొబైల్ ఎక్స్‌రే యూనిట్ పనితీరును పరిశీలించారు. ప్రజా సేవల తీరుపై ఆరా తీశారు. ఫార్మసీ విభాగాన్ని తనిఖీ చేసి ఈఔషధి పోర్టల్‌లో నమోదైన ఔషధ నిల్వలు, పంపిణీ వివరాలను పరిశీలించడంతో పాటు మాన్యువల్ స్టాక్ రిజిస్టర్లతో సరిపోల్చి ధృవీకరించారు. గడువు ముగియబోతున్న మందుల కోసం ప్రత్యేకంగా నియర్ ఎక్స్‌పైరీ డ్రగ్ కార్నర్ ఏర్పాటు చేసి వాటి నిర్వహణలో ఎలాంటి నిరక్ష్యం ఉండకూడదని ఫార్మసీ అధికారికి ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ ఆరోగ్య సేవల్లో ప్రజల సంక్షేమమే అత్యున్నత ప్రాధాన్యమని డా. కె.ఆనంద్ తెలిపారు. ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగిని ఆప్యాయంగా ఆదరించి నాణ్యమైన వైద్య సేవలు అందించడం ప్రతి ఉద్యోగి బాధ్యత అని పేర్కొన్నారు. ప్రజలు ప్రభుత్వ ఆసుపత్రులపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టేందుకు అందరూ కృషి చేయాలని సూచించారు. విధుల పట్ల నిరక్ష్యం ప్రదర్శించే అధికారులపై శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించిన ఆయన, ఉద్యోగులందరూ విధి సమయాలను ఖచ్చితంగా పాటించాలని, నిర్ణీత యూనిఫామ్‌లో విధులకు హాజరుకావాలని, ఆసుపత్రి పరిశుభ్రతను కాపాడాలని, రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరించాలని, ప్రభుత్వం నిర్దేశించిన అన్ని ఆరోగ్య కార్యక్రమాల లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రజలకు ఇబ్బందులు కలిగించే నిరక్ష్యాన్ని కఠినంగా పరిగణించి అవసరమైన శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

### నీట్ మంటలు ఉధృతం



జవహర్‌నగర్‌లో ధర్నా చేస్తున్న కాంగ్రెస్ నేతలు

♦రెండో రోజూ కొనసాగిన కాంగ్రెస్ ధర్నాలు ♦పేపర్ లీకేజీతో విద్యార్థుల భవిష్యత్తు ప్రమాదంలో పడిందని ఆందోళన ♦ కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు డిమాండ్

3లో

# డ్రైవింగ్ లైసెన్స్ కావాలా?






## జిల్లాల పునర్విభజనతో ఆమనగల్లు ప్రాంత ప్రజలకు తప్పని దూరాభారం

### ఆర్టీఓ సేవలకు మణికొండ, షాద్‌నగర్, మన్నెగూడకు పరుగులు

### సబ్ సెంటర్ అయినా నిర్వహించాలని డిమాండ్

**ఆమనగల్లు, జులై23, ప్రభాతవార్త:** పౌర సేవలను ప్రజల ముంగిటకు తెస్తున్నామని ప్రభుత్వాలు చెబుతున్నా.. రవాణా శాఖ సేవలు మాత్రం ఆమనగల్లు ప్రాంత వాసులకు అల్లంతదూరాన నిలిచిపోయాయి. చిన్న పనికి కూడా సుదూర ప్రయాణాలు చేయాల్సి వస్తోంది. దీంతో రంగారెడ్డి జిల్లా ఆమనగల్లు పూర్వ సమితి పరిధిలోని ఆమనగల్లు, కడ్తాల, తలకొండపల్లి, మాడ్గుల మండలాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ఉన్నప్పుడు ఈ నాలుగు మండలాల ప్రజలు సమీపంలోని కల్వకుర్తిలోనే ఆర్టీఓ సేవలు పొందేవారు. జిల్లాల పునర్విభజన తర్వాత ఈ మండలాలు రంగారెడ్డి జిల్లాలో విలీనమవ్వడంతో తిప్పలు మొదలయ్యాయి.

ప్రస్తుతం ఆమనగల్లు, కడ్తాల, తలకొండపల్లి ప్రజలు 60 కి.మీ దూరంలో ఉన్న షాద్‌నగర్ ఆర్టీఓ ఆఫీస్‌కు వెళ్లాల్సి వస్తోంది. అక్కడికి నేరుగా బస్సు సౌకర్యం లేక ప్రత్యేక వాహనాలు కుదుర్చుకోవాల్సి వస్తోంది. అలాగే మాడ్గుల ప్రాంత వాసులు హైదరాబాద్ శివారులోని మన్నెగూడ ఆర్టీఓ ఆఫీస్‌కు వెళ్లాల్సి రావడం వల్ల రోజంతా వృథా అవుతోంది. ఆటో, ట్రాక్టర్, లారీ, టాక్సీల ఫిట్‌నెస్, పర్మిట్, హెవీ లైసెన్స్ పనుల కోసం దాదాపు 100 కి.మీ దూరంలో ఉన్న హైదరాబాద్ మణికొండ ఆర్టీఓ ఆఫీస్‌కు వెళ్లాల్సి వస్తోంది. అక్కడికి వెళ్లడానికి రూ.500 నుండి రూ.1000 వరకు ఖర్చు కావడమే కాక, ఉపాధి కోల్పోవాల్సి వస్తోందని వాహనదారులు, ఆటో డ్రైవర్లు వాపోతున్నారు. నాలుగు మండలాల్లో లక్షకు పైగా జనాభా, 30 నుండి 40 వేల వరకు అన్ని రకాల వాహనాలు ఉన్నాయి. సాంకేతిక లోపాల వల్ల ఒకసారి వెళ్లిన పని కాకపోతే మళ్లీ మళ్లీ తిరగాల్సి వస్తోందని మహిళలు, రైతులు, విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. షాద్‌నగర్‌లో అందుతున్న ఎంవీఐ సేవలకు సంబంధించి ఆమనగల్లులోనే ఒక సబ్‌సెంటర్ ఏర్పాటు చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. కమర్షియల్ వాహనాల సేవలను మణికొండకు బదులు షాద్‌నగర్‌లోనే అందించాలని కోరుతున్నారు. కనీసం వారానికి రెండు రోజులు (నెలలో 8 రోజులు) క్యాంప్ నిర్వహించినా ఇబ్బందులు తగ్గుతాయని పేర్కొంటున్నారు. దీనిపై ఆమనగల్లు మున్సిపల్ చైర్మన్ నేనావత్ పత్యనాయక్ మాట్లాడుతూ, స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డితో కలిసి రవాణా శాఖ మంత్రిని, కమిషనర్‌ను కలిసి ఆమనగల్లులో సబ్‌సెంటర్ ఏర్పాటుకు కృషి చేస్తామని తెలిపారు.

# చిగురించిన సాంప్రదాయం

## బడిలో గోరింటాకు వసంతం



పెద్దేముల్‌లోని ప్రైవేట్ స్కూల్‌లో గోరింటాకు పండుగను నిర్వహిస్తున్న విద్యార్థినులు

**పెద్దేముల్, జులై 23, ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని స్వామి వివేకానంద పాఠశాలలో ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని గోరింటాకు పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం జయంతి మాట్లాడుతూ గోరింటాకు శుభానికి, సౌభాగ్యానికి ప్రతీక అని తెలిపారు. ఆషాఢ మాసంలో ఆడపిల్లలు, మహిళలు చేతులకు గోరింటాకు పెట్టుకోవడం అనాదిగా వస్తున్న సాంప్రదా యమని, ఆషాఢంలో వర్షాలతో పాటు వాతావరణంలో మార్పులు వస్తాయని పేర్కొన్నారు. గోరింటాకు శరీరంలోని వేడిని తగ్గించి, ఉష్ణోగ్రతను నియంత్రించడంలో సహాయపడుతుందని, ఇది చల్లదనాన్ని ఇవ్వడమే కాకుండా, క్రిమికీటకాల నుంచి చర్మానికి రక్షణ కల్పిస్తుందన్నారు. గోరింటాకు కేవలం అలంకరణ మాత్రమే కాకుండా ఆరోగ్యపరంగా, సాంస్కృతికంగా, ఆధ్యాత్మికంగా కూడా ఎంతో ప్రాధాన్యత కలిగి ఉందని చెప్పారు. ఆషాఢంలో మహిళలు, అమ్మాయిలు కలిసి గోరింటాకు పెట్టుకోవడం వల్ల కుటుంబ సభ్యులు, బంధుమితుల మధ్య ఆప్యాయతలు, అనుబంధాలు మరింత బలపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ కరుణాకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు రాధ, నిర్మల, కల్పన, అప్సాన, సునీతా, వెంకటలక్ష్మి, అంజలి, హరిసూధన్‌రెడ్డి, నరేష్‌రెడ్డి పాల్గొన్నారు.

### సీఎం సారూ మీరూ..

# సర్కారు బడి స్టూడెంటే కదా!

పాఠశాలలను కుదించటం తగునా?

స్కాలర్‌షిప్ బకాయిలు విడుదల చేయండి

ఏఐఎస్ఎఫ్ నేతల డిమాండ్



మేడ్చల్ కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, జులై 23, ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్రంలో విద్యా రంగాన్ని ప్రభుత్వం విస్మరిస్తుందని, పాలకులు విద్యార్థుల భవిషత్‌తో ఆటలాడుకుంటున్నారని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు రెహమాన్ విమర్శించారు. విద్యార్థుల స్కాలర్‌షిప్స్, ఫీజురియంబర్స్‌మెంట్ (పెండింగ్‌లో ఉన్న) నిధులను వెంటనే విడుదల చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్ వద్ద ఏఐఎస్ఎఫ్ విద్యార్థి నాయకులు రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ధర్నా చేశారు. మేడ్చల్ జిల్లా సమితి ఆద్వర్యంలో కలెక్టరేట్ ముందు వారు ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు రెహమాన్ మాట్లాడుతూ ప్రభుత్వం స్కాలర్‌షిప్స్, ఫీజురియంబర్స్‌మెంట్ పెండింగ్ నిధులు విడుదల చేయకపోతే విద్యార్థులు చదువుకునేది ఎలా అని ప్రశ్నించారు. ప్రభుత్వ పాఠశాలలో చదివి సిఎంను అయ్యాను అని చెబుతున్న రేవంత్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలలను కుదించాలని తగ్గించాలని అనటం ఎంత వరకు సబబు అని ఆయన ప్రశ్నించారు. కెజి టు పిజి వరకు ప్రభుత్వ విద్యా సంస్థలు సమస్యలకు నిలయాలుగా మారాయని ఆయన విమర్శించారు. ఇకనైనా తెలంగాణ ప్రభుత్వం విద్యాశాఖకు ప్రత్యేక మంత్రిని నియమించి విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి అన్వర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే విద్యార్థుల స్కాలర్‌షిప్స్, ఫీజురియంబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే చెల్లించాలని, విడుదల చేయకుంటే ప్రభుత్వంపై విద్యార్థుల ఉద్యమం తప్పదని ఆయన హెచ్చరించారు. ధర్నా అనంతరం కలెక్టరేట్‌లో డిఆర్ఓ మాలతికి ఏఐఎస్ఎఫ్ నాయకులు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు హరీశ్, జిల్లా నాయకులు మహేశ్, అజీమ్, కృష్ణ, యాకుబ్, శ్రీకాంత్, చరణ్, వంశీ, తదితరులు పాల్గొన్నారు.



సెల్ ఫోన్‌లో నిధుల విడుదల మెసేజ్‌ను రైతులకు చూపిస్తున్న ఆర్డీవో పార్థసింహారెడ్డి

# రేడియల్ రోడ్ భూసేకరణ వేగం

## షాబాద్ రైతులకు రూ.37.11 కోట్ల పరిహారం

**షాబాద్, జులై 23, ప్రభాతవార్త :** షాబాద్ మండలంలో ప్రతిపాదిత రేడియల్ రోడ్2 నిర్మాణం కోసం చేపట్టిన భూసేకరణ ప్రక్రియ వేగంగా కొనసాగుతోందని చేవెళ్ల ఆర్డీవో పార్థసింహారెడ్డి తెలిపారు. గురువారం శాబాద్ మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో తహసీల్దార్ అన్వర్‌తో కలిసి రేడియల్ రోడ్2 పరిధిలో భూములు కోల్పోతున్న రైతులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ, రైతులు స్వచ్ఛందంగా అందించిన సహకారంతో భూసేకరణ అవార్డు ప్రక్రియ విజయవంతంగా కొనసాగుతోందన్నారు. ఇప్పటివరకు 344 మంది రైతులు సమ్మతి (కన్సెంట్) అవార్డులకు అంగీకరించగా, 228.31 ఎకరాల భూమికి అవార్డులు పూర్తి చేసినట్లు తెలిపారు. సోలిపేట్, పెద్దవేడు, హైతాబాద్, దామర్లపల్లి, మాచన్‌పల్లి గ్రామాలకు చెందిన రైతుల బ్యాంకు ఖాతాల్లో మొత్తం రూ.37,11,12,500 పరిహారాన్ని జమ చేసినట్లు వెల్లడించారు. ప్రభుత్వం త్వరితగతిన పరిహారం అందించడంతో రైతులు సంతోషం వ్యక్తం చేశారని పేర్కొన్నారు. అదేవిధంగా శాబాద్, బోనగిరపల్లి, నాగర్‌కుంట గ్రామాలకు చెందిన రైతుల బ్యాంకు ఖాతాల్లో కూడా నేటి నుంచే పరిహారం జమ చేసే ప్రక్రియ ప్రారంభమవుతుందని చెప్పారు. అర్హులైన నిర్వాసితులకు ఇంటి స్థలాలను కూడా త్వరలోనే కేటాయిస్తామని హామీ ఇచ్చారు. ప్రజాప్రయోజనకరమైన రేడియల్ రోడ్2 ప్రాజెక్టు త్వరితగతిన పూర్తయ్యేందుకు సహకరించిన రైతులు, ప్రజాప్రతినిధులకు జిల్లా యంత్రాంగం కృతజ్ఞతలు తెలిపింది. మిగిలిన రైతులు కూడా ఇదే విధంగా సహకరించాలని అధికారులు కోరారు. ఈ సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ రవికుమార్, సర్పంచులు రాజేందర్‌రెడ్డి, ఒగ్గు రాజు, రైతులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# కొత్తగా విత్తనాలు వేయద్దు

## 50-75 మి.మీ వర్షపాతం ఉంటేనే ముందుకెళ్లండి

### మొక్కజొన్న రైతులకు వ్యవసాయశాఖ దిశానిర్దేశం

**షాద్‌నగర్, జులై 23, ప్రభాతవార్త :** ప్రభుత్వ ఆదేశాల మేరకు వానాకాలం-2026 అత్యవసర (కాంటింజెన్సీ) పంట ప్రణాళికపై రైతులు, సర్పంచులు, ప్రజాప్రతినిధులు, మండల, గ్రామ స్థాయి అధికారులకు అవగాహన కల్పించేందుకు గురువారం ఫరూక్‌నగర్ మండలంలో మండల స్థాయి సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో వర్షాభావ పరిస్థితులు ఏర్పడితే రైతులు చేపట్టాల్సిన ప్రత్యామ్నాయ పంటల సాగు, తేమ సంరక్షణ చర్యలు, ఎరువుల యాజమాన్యం, పురుగులు-తెగుళ్ల నివారణపై పలు సూచనలు చేశారు. 31 జులై నుంచి 15 ఆగస్టు 2026 వరకు వర్షపాతం తక్కువగా నమోదయ్యే పరిస్థితుల్లో రైతులు తక్కువ నీటి అవసరమున్న పంటలను ఎంచుకోవాలని సూచించారు. ఇంకా విత్తని భూముల్లో కనీసం 50-75 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైన తర్వాతే విత్తనాలు వేయాలని తెలిపారు. కంది, పెసర, మినుము, అలసంద, జొన్న, సజ్జ, కొర్ర, రాగి, నువ్వులు, ఆముదం వంటి స్వల్పకాలిక, తక్కువ నీటి అవసరమున్న పంటలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. మొక్కజొన్న పంటకు తేమ కొరత ఉంటే కొత్తగా విత్తడం నివారించాలని, ఇప్పటికే సాగులో ఉన్న పంటల్లో కలుపు నివారణ, తగిన తేమ ఉన్నప్పుడు మాత్రమే యూరియా పైపూత, మల్చింగ్ వంటి చర్యలు చేపట్టాలని సూచించారు. ఫాల్ ఆర్మీవార్మ్ ఉధృతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని తెలిపారు. వర్షాభావ పరిస్థితుల్లో నేలలో తేమను సంరక్షించేందుకు అంతర దుక్కులు, కలుపు నివారణ, మల్చింగ్, ఫార్మ్ పాండ్లు, చెక్‌బండ్ల నిర్మాణం వంటి చర్యలు చేపట్టాలని సూచించారు. నేల పరీక్ష ఆధారంగా ఎరువులు వాడాలని, తేమ ఉన్నప్పుడు మాత్రమే యూరియా వేయా లని, జీవ మరియు సేంద్రియ ఎరువుల వినియోగాన్ని పెంచాలని తెలిపారు. పంటలను వారానికి కనీసం రెండుసార్లు పరిశీలిస్తూ, ఆర్థిక నష్టం స్థాయి దాటిన తర్వాతే పురుగుమందులు వినియోగించాలని సూచించారు.

ఆగస్టు 15 నాటికి వర్షాలు సాధారణ స్థాయికి రాకపోతే వరి, మొక్కజొన్న కొత్తగా సాగు చేయకుండా కంది, ఆముదం, సజ్జ, జొన్న, కొర్ర వంటి తక్కువ నీటి అవసరమున్న పంటలను ఎంచుకోవాలని తెలిపారు. పశుగ్రాసం కోసం ఫోడర్ జొన్న లేదా మల్టీకట్ పశుగ్రాస పంటలను సాగు చేయాలని సూచించారు. వర్షాలు మెరుగుపడితే స్వల్పకాలిక వరి రకాలు, స్వల్పకాలిక పప్పుధాన్యాలను సాగు చేసుకోవచ్చని, పైపూత ఎరువులను తేమను బట్టి దశలవారీగా వేయాలని తెలిపారు. ఈ సమావేశంలో ఎంపీడీవో, హెచ్‌ఓ, ఏపీవో, డీఈ, ఏఈ, ఏపీఎం, వివిధ గ్రామాల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, వ్యవసాయ విస్తరణ అధికారులు తదితరులు పాల్గొన్నారు.






సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు, హాజరైన ఉద్యోగులు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ దీపక్ తివారీ

# ఒక్క ఫిర్యాదు కూడా రాకూడదు

## పారదర్శకతతో సర్ విధులు : కలెక్టర్ దీపక్ తివారీ

**వికారాబాద్, ప్రభాతవార్త :** రోజు వారి లక్ష్యాలను నిర్దేశించుకొని ఎస్ఐఆర్ ప్రక్రియను వేగవంతం చేయాలనీ జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ అన్నారు. గురువారం వీడియో కాన్ఫరెన్సు హాలు నుండి అన్ని మండలాల తహసిల్దార్లు, ఎంపీడీఓ లు, మున్సిపల్ కమిషనర్‌లతో జూమ్ సమావేశము నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని ప్రతి రోజు 5 శాతం చొప్పున లక్ష్యాన్ని నిర్దేశించుకొని మూడు రోజులలో 90 శాతం పూర్తి చేయాలనీ అన్నారు. ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని ఆగష్టు 3వ తేది వరకు ఎన్నికల కమిషన్ పొడిగించినందున, భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు పారదర్శకంగా, ఖచ్చితత్వంతో నిర్వహించాలని జిల్లా కలెక్టర్ మండల తహసీల్దార్లను ఆదేశించారు. ఓటరు జాబితాలో అర్హులైన ప్రతి ఒక్కరి పేరును నమోదు చేయడం, అనర్హుల పేర్లను నిబంధనల ప్రకారం తొలగించడం, మార్పులు, చేర్పులు, సవరణలను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని సూచించారు. బూత్ లెవల్ అధికారులతో సమన్వయం చేసుకుంటూ ఇంటింటి ధృవీకరణను సమర్థవంతంగా నిర్వహించాలని, ఓటర్ల నుంచి వచ్చే దరఖాస్తులను సకాలంలో పరిశీలించి నిబంధనల ప్రకారం పరిష్కరించాలని తెలిపారు. ఎలాంటి ఫిర్యాదులకు తావు లేకుండా పూర్తి పారదర్శకతతో విధులు నిర్వహించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా మండలం వారిగా పూర్తి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు అయ్యేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ జూమ్ సమా వేశంలో ట్రైని కలెక్టర్ సచిన్ బస్వరాజ్ గుట్టూర్, జడ్పీ సీఈఓ సుదీర్, డీఆర్ఓ స్వర్ణలత, ఆర్డీఓ వాసుచంద్ర, ఎన్నికల విభాగం సుపరింటెండెంట్ నేమత్ అలీ పాల్గొన్నారు.

# కలెక్టర్ గారూ.. ఇది కరెక్టు కాదు

▶కోర్టు ఆదేశాలు లెక్క చెయ్యరా?
▶స్టేటస్‌కో ఉత్తర్వులు తెచ్చుకున్నా రైతులకు వేధింపులేనా..
▶బిజెపి రాష్ట్ర అధ్యక్షులు రాంచందర్‌రావు

**శామీర్‌పేట, జులై 23, ప్రభాతవార్త :** బొమ్మరాసిపేట్ గ్రామ పరిధి లోని పలువురు రైతులను ధరణి, భూభారతి పేర్లతో ప్రభుత్వం పీడిస్తుం దని, మరో వైపున రెవెన్యూ అధికారుల, దళారుల చేతుల్లో రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు రాంచందర్‌రావు ఆందోళన వ్యక్తం చేశారు. గురువారం శామీర్‌పేట మండలంలోని బొమ్మ రాసిపేట్ గ్రామాన్ని ఆయన సందర్శించి క్షేత్రస్థాయిలో పొలాలను పర్యటించి రైతుల పరిస్థితితులను అడిగి తెలుసుకున్నారు. అయితే రెవెన్యూ అధికా రుల, దళారుల చేతిలో రైతులు ఇబ్బందులు పడుతున్నారన్న సమాచారంతో బిజెపి రాష్ట్ర అధ్యక్షులు రాంచందర్‌రావు స్వయంగా సందర్శించి రైతులను కలిసి అడిగి తెలుసుకున్నట్లు తెలిపారు. బాధిత రైతుల పొలాలను ఆయన స్వయంగా పర్యటించి పరిశీలించారు. అయితే దళారుల వేధింపులు, రెవెన్యూ అధికారుల తీరుతో బాధిత రైతులు అయోమయంగా ఉన్నారని ఆయన అన్నారు. ఈ సందర్భంగా బిజెపి రాష్ట్ర అధ్యక్షులు రాంచందర్‌రావు మాట్లాడుతూ బొమ్మరాసిపేట్ గ్రామంలో అత్యధికంగా చిన్న, సన్నకారు రైతులే ఉన్నారని, గత 50ఏళ్లుగా భూములను రైతులు నమ్ముకుని జీవనం సాగిస్తున్నట్లు తెలిపారు. పట్టాదారుల భూములలో ఎటువంటి మార్పులు చేయకూడదని తమ భూములను కాపాడుకోవటానికి రైతులు న్యాయస్థానాలను ఆశ్రయించారని స్టేటస్‌కో ఉత్తర్వులు తెచ్చుకుపప్పటికీ రెవెన్యూ అధికారులు దళారులతో కుమ్మకై ధరణి, భూభారతి పోర్టళ్లలో రైతుల పేర్లు మార్చేస్తున్నారని ఆయన ఆరోపించారు. కొన్నేళ్ల నుంచి సాగుచేసుకుంటున్న సన్న, చిన్న కారు పట్టాదారులు భూముల్లో ఎలాంటి మార్పులు చేయవద్దని కోర్టు ఆదేశాలు ఇచ్చినా లెక్క చేయకుండ రికార్డులను భూభారతిలో మార్చటం తీవ్ర అన్యాయమని ఆయన అన్నారు. ధరణి, భూభారతి వ్యవస్థల పేరుతో అధికారులు రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని విమర్శించారు. ఇకనైనా జిల్లా కలెక్టర్, రెవెన్యూ ఉన్నతాధికారులు వెంటనే స్పందించి బాధితులకు న్యాయం చేయాలని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు రాంచందర్‌రావు డిమాండ్ చేశారు. లేని పక్షంలో బిజెపి ఆద్వర్యంలో పెద్ద ఎత్తున రైతుల పక్షాన ఉద్యమిస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బొమ్మరాసిపేట్ గ్రామ రైతులు తదిత రులు పాల్గొన్నారు.



బొమ్మరాసిపేట్‌లోని రైతుల పొలాలను సందర్శిస్తున్న బిజెపి రాష్ట్ర అధ్యక్షులు రాంచందర్‌రావు తదితరులు

### ●శోభాయమానం..



## ఉజ్జయినీ మహాకాళీ ఆలయానికి 500కేజీల కూరగాయలతో అలంకారం

### నేడు శాకంబరీదేవిగా భక్తులకు దర్శనం

సికింద్రాబాద్ శ్రీఉజ్జయినీ మహాకాళీ అమ్మ వారి ఆషాడ బోనాల ఉత్సవాల సందర్భంగా ఆలయాన్ని 500కేజీల వివిధ రకాలైన కూరగాయలతో అందంగా అలంకరించారు. శుక్రవారం అమ్మ వారు శాకంబరీగా భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. ఆలయ ఇవో అధ్వర్యంలో పటిష్టమైన ఏర్పాట్లు చేశారు.

## బోనాల వేళ 'డొల్ల' పనులు

ఆటోలు, బస్సులు రాక విద్యార్థుల అవస్థలు



-ప్రభాతవార్త, హైదరాబాద్

పాతబస్తీ వ్యాప్తంగా ఆషాఢ బోనాల దృష్ట్యా చేపట్టిన రోడ్లు, డ్రైనేజీ తవ్వకాల పనుల్లో ఘోరమైన నాణ్యతా లోపాలు బయటపడుతున్నాయి. 30 శాతం లెస్ టెండర్లతో పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్లు నాసిరకం నిర్మాణాలతో ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ఇంకుడు గుంతలు, మ్యాన్హోల్ కవర్లు పూర్తవకముందే బీటలు వారినా ఇంజనీరింగ్ అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం.



కరీంపూర్ కస్తూర్బాగాంధీ పాఠశాలలో నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టిన ఎంఇవో చంద్రప్ప, స్పెషల్ ఆఫీసర్ పల్లవిరెడ్డి

## కెజిబివి పాఠశాల మురుగు సమస్యకు పరిష్కారం

**'వార్త' కథనానికి స్పందన**

**కోట్‌పల్లి, జులై 23, ప్రభాతవార్త:** వికారాబాద్ జిల్లా కోట్‌పల్లి మండల పరిధిలోని కరీంపూర్ గ్రామంలోని కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయం (కేజీబీవీ) ప్రాంగణం ఇటీవల కురిసిన వర్షాలకు పూర్తిగా నీట మునిగిపోయి చెరువును తలపించే పరిస్థితి నెలకొన్నట్లు గురువారం నాడు వెలువడిన వార్తా పత్రికా కథనానికి అధికారులు మండల విద్యాధికారి, చంద్రప్ప, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ పల్లవిరెడ్డి, వెంటనే స్పందించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని విద్యా బోధన, విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలు మరియు మౌళిక వసతులను పరిశీలించారు. పాఠశాల ప్రాంగణంలో నీరు నిల్వ ఉండకుండా వసతి గృహాలకు వెళ్లేందుకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా జేసీబీ సహాయంతో పాఠశాల ప్రాంగణంలోని నిల్వ నీటిని తొలగించి, నీరు నిల్వ ఉండకుండా మట్టితో పూడ్చివేశారు. దీంతో పాఠశాల ఆవరణ సాధారణ స్థితికి చేరు కోవడంతో విద్యార్థినులకు రాకపోకలు సులభమయ్యాయి తగిన చర్యలు చేపట్టడంతో పాటు, పాఠశాలకు కాంపౌండ్ వాల్ నిర్మాణం అవసరమని గుర్తించి, ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన చర్యలు తీసుకునేలా కృషి చేస్తామని మండల విద్యాధికారి తెలిపారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నాణ్యమైన విద్య, తాగునీటి సౌకర్యం, రన్నింగ్ వాటర్, ఉచిత పాఠ్య పుస్తకాలు, షూస్ తదితర ప్రభుత్వ సంక్షేమ సౌకర్యాలు అందుతున్న తీరును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థుల సంక్షేమం, భద్రత మరియు విద్యా ప్రమాణాల మెరుగుదలకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని వారు పేర్కొన్నారు.



గీతా వాహిని సభ్యుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ కౌన్సిలర్ శ్రీదేవి

## రేపటి నుంచి గీతా పారాయణం

**వికారాబాద్, ప్రభాతవార్త :** ఈ నెల 25వ తేదీ నుంచి గీతా పారాయణం నిర్వహిస్తున్నట్లు గీతా వాహిని అధ్యక్షురాలు, మాజీ కౌన్సిలర్ టి.శ్రీదేవి తెలిపారు. గురువారం వికారాబాద్ పట్టణంలో గీతా వాహిని సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, మొదటి రోజు 25వ తేదీ అనంతగిరిలోని అనంత పద్మనాభ స్వామి దేవాలయంలో నిర్వహిస్తామన్నారు. 26న వెంకటేశ్వర కాలనీలోని వెంకటేశ్వర స్వామి ఆలయంలో, 27న మదన్‌పల్లి లోని సంగమేశ్వర ఆలయంలో, 28న ఆలంపల్లి లోని బోనమ్మ దేవాలయంలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 29న న్యూ గంజ్ లోని హనుమాన్ మందిరంలో, 30న రామయ్యగూడ (ఎంఐజి)లోని హనుమాన్ దేవాలయంలో, 31న ఎన్నెపల్లి లోని కార్తికేయ కాలనీ లోని వీర శైవ బసవ భవనంలో నిర్వహిస్తున్నామన్నారు. ఆగస్టు 1న కొత్రేపల్లిలోని హనుమాన్ దేవాలయంలో, 2న మారుతీనగర్ లోని వైభవ లక్ష్మి ఆలయంలో నిర్వహిస్తున్నామని తెలిపారు. గీతా వాహిని ప్రధాన కార్యదర్శి జయశ్రీ మాట్లాడుతూ, గత 9 సంవత్సరాల నుండి గీతా పారాయణం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రతి ఆషాడమాసంలో 9 రోజులపాటు గీతా పారాయణం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో గీతా వాహిని ఉపాధ్యక్షురాలు కె.విజయలక్ష్మి, సభ్యులు ఎస్.మాధవి, ఆర్. ఝాన్సీరాణి, పి.వరలక్ష్మి, ఎల్.సరళ, కె.నీరజ, పి.సంజీవరాణి, ఎం.స్వాతి, పి.నాగరాణి, ఎం.జ్యోత్స్న, ఆర్.లక్ష్మి, పి.రజిత తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యమకారులను విస్మరించటం తగదు



మాట్లాడుతున్న టిటి జెఎసి నాయకులు

**షాద్‌నగర్, జులై 23, ప్రభాతవార్త :** ఉద్యమంలో పగలు, రాత్రి పని చేసింది ఒకరు.. చివరికి ఉద్యమకారులుగా వెలుగు వెలుగుతున్నది మరోకరు.. ఆనాడు ఉద్యమాన్ని వ్యతిరేకించిన వాళ్లే ఈరోజు నాయకులుగా మారి ఉద్యమకారులుగా పేరు తెచ్చుకున్నారు.. అసలైన ఉద్యమకారులకు అవమానం.. సమైక్యవాదులకు సన్మానం.. ఇది ఎక్కడి న్యాయం..? అంటూ షాద్ నగర్ తెలంగాణ టీచర్స్ జేఏసీ చైర్మన్ ఏ. శ్రీధర్ రెడ్డి ప్రశ్నించారు. పట్టణంలో సమావేశమైన ఉపాధ్యాయులు ఇటీవల ఎమ్మెల్యే ఆధ్వర్యంలో మండల పరిషత్ కార్యాలయావరణంలో ఏర్పాటు చేసిన ఉద్యమకారుల సన్మాన కార్యక్రమ నిర్వహణపై చర్చించారు. ఈ సందర్భంగా శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ ఈ నెల 19వ తేదీన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తన సొంత ఖర్చుతో అమరవీరుల స్థూపాన్ని ఏర్పాటు చేయడం ఎంతో సంతోషాన్ని ఇచ్చిందని, ఈ సందర్భంగా ఆయనకు మనస్ఫూర్తిగా ఉద్యమ వందనాలు తెలియజేసుకుంటున్నామని తెలిపారు. కార్యక్రమం సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఉద్యమకారులందరినీ గుర్తించి వారిని కలుపుకోవాలని చెప్పినప్పటికీ ప్రస్తుత జేఏసీ చైర్మన్ తదితరులు ఆనాటి సమైక్యవాది ఐదారు ఉపాధ్యాయ సంఘాలు ఉన్నప్పటికీ వారందరినీ విస్మరించి కార్యక్రమాన్ని నిర్వహించారని ఆరోపించారు. ఉద్యమాన్ని వ్యతిరేకించిన వారందరినీ సంఘ సభ్యులుగా గుర్తించి ప్రాధాన్యత ఇవ్వడం ఆక్షేపణీయమని అన్నారు. పి ఆర్ టి యు, టి పి ఎస్ యు, ఏపీ టీఎస్, గిరిజన ఉపాధ్యాయ సంఘం వంటివి ఉన్నప్పటికీ వాటన్నిటినీ విస్మరించి కొందరిని మాత్రమే ఉద్యమకారులుగా ప్రకటించుకోవడం అన్యాయం అన్నారు.షాద్ నగర్ ప్రాంతంలో పండగ రోజుల్లో కూడా ఉద్యమాన్ని కొనసాగించి ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసి పడినందుకు తెలంగాణ టీచర్స్ జాయింట్ యాక్షన్ కమిటీ చేసిన కృషి మరువలేనిది అన్నారు. ధూమ్ ధాం, వంటావార్పు, మానవహారం లాంటి ఎన్నో కార్యక్రమాలలో చురుకుగా పాల్గొన్నట్లు వెల్లడించారు. ఇలా ఏకపక్షంగా కార్యక్రమాన్ని నిర్వహించడం బాధాకరమని తెలిపారు. ఆనాటి పోరాట సంఘాలు, నాయకులు, కుల సంఘాలు, ఇతర సంఘాల ద్వారా వివరాలు సేకరించి ఉంటే ఈ పరిస్థితి ఉండేది కాదని అన్నారు. భవిష్యత్తులోనైనా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించకుండా అందరినీ సమైక్యంగా ముందుకు తీసుకోవాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. టిటిజెఏసీ నేతలు అబ్దుల్ మన్నన్, మొహమ్మద్ అలీ, సురేష్ కుమార్, పాండురంగయ్య, వెంకటరెడ్డి, చెన్నూరి రమేష్, నాజర్ అలీ, సత్యనారాయణ, నర్సింలు, మనోహర్, గణేష్ కుమార్, సురేందర్ రెడ్డి, జైపాల్ రెడ్డి, ప్రకాష్, బద్య, బిఎంబి రాజు, ప్రవీణ్ కుమార్, బుచ్చయ్య, బాలరాజు, వెంకటరమణ ఈ సమావేశంలో పాల్గొన్నారు.

# వికసిత భారత్‌లో భాగస్వాములవ్వండి

### యువ ఇంజినీర్లకు డీఆర్‌డీవో మాజీ చైర్మన్ పిలుపు

**ఘట్‌కేసర్ రూరల్, జులై 23, ప్రభాతవార్త:** వికసిత భారత్ 2047 నాటికి యువ ఇంజినీర్లు అన్ని రంగాల్లో కీలకపాత్ర పోషించాలని అంతరిక్ష శాస్త్రవేత్త డీఆర్‌డీవో మాజీ చైర్మన్ జి. సతీశ్ రెడ్డి అన్నారు. పోచారం డివిజన్ కాచవాని సింగారంలోని నల్ల మల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం గ్రాడ్యుయేషన్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డీఆర్‌డీవో మాజీ చైర్మన్ సతీశ్ రెడ్డి పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసిన అనంతరం మాట్లాడుతూ దేశ పురోగతిలో యువ ఇంజనీర్లే ముఖ్యమని అన్నారు. పరిశోధనలు, ఆవిష్కరణలు, పారిశ్రామిక రంగాల్లో ఉద్యోగులుగా కాకుండా ఉద్యోగాలు సృష్టించే ఇంజనీర్లుగా ఎదగాలని అన్నారు. సాంకేతిక నైపుణ్యాన్ని దేశ ప్రగతికి వినియోగించాలని విద్యార్థులకు సూచించారు. ఈ సందర్భంగా విద్యలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు గోల్డ్, సిల్వర్ మెడల్స్‌ను ముఖ్య అతిథి చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్‌పర్సన్ కేతిరెడ్డి సంధ్యావళి, కార్యదర్శి నల్ల మల్లారెడ్డి, కళాశాల డైరెక్టర్ దివ్య నల్ల, ప్రొఫెసర్ స్నేహ నల్ల, కళాశాల ప్రిన్సిపాల్ ఎం.ఎన్‌వి. రమేశ్,



గ్రాడ్యుయేషన్ డే వేడుకల్లో పాల్గొన్న డీఆర్‌డీవో మాజీ చైర్మన్ సతీశ్‌రెడ్డితో గోల్డ్, సిల్వర్ మెడల్స్ పొందిన విద్యార్థులు

ఆయా డిపార్టుమెంట్ల డీన్‌లు ఎం.రాజు,ఎస్. రామకృష్ణారెడ్డి, రజని ధరణికోట, జి. ప్రేమ్‌కుమార్‌రెడ్డి, టి.వి.ఎస్.ఎంఆర్. భూషణ్, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసేదాకా వదిలేదేలే

**షాద్‌నగర్, జులై 23, ప్రభాతవార్త :** దేవుడి అక్షింతలను ఇంటింటికి ఇచ్చి అధికారంలోకి వచ్చారు.. కానీ ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తే అహంకారాన్ని ప్రదర్శిస్తున్నారు.. ఇదొక్కటి దారుణం.. ఇది ప్రజాస్వామ్య ప్రభుత్వమా.. మోదీ ఖబర్దార్.. బిజెపి ఖబర్దార్.. అంటూ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ హెచ్చరిక చేశారు. షాద్‌నగర్ పట్టణ కూడలిలో నీట్ పేపర్ లీకేజీ పై విద్యార్థులు చేస్తున్న ఆందోళనకు ఆయన మద్దతు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీట్ పేపర్ లీకేజీ కారణంగా 22 లక్షల మంది విద్యార్థుల జీవితాలు బలి అయ్యాయని, 22 మంది విద్యార్థులు ప్రాణాలు కోల్పోయారని, అయినా కేంద్ర ప్రభుత్వానికి చీమకుట్టినట్టు కూడా లేకపోవడం దురదృష్టకరమని ఆయన పేర్కొన్నారు. విద్యార్థులకు అండగా రాహుల్ గాంధీ పోరాటం చేస్తుంటే విద్యార్థులపై లాఠీలు విసరడమే కాకుండా, రాహుల్ గాంధీని కూడా గాయపరిచారని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థులు అడుగుతున్న ప్రశ్నలకు ప్రభుత్వం సమాధానం చెప్పాల్సిందేనని ఆయన పేర్కొన్నారు. ఈ విషయంపై పార్లమెంటులో చర్చించేందుకు రాహుల్ గాంధీ సిద్ధంగా ఉన్న ప్రభుత్వం ముందుకు రావడంలేదని అన్నారు. ఇప్పటిదాకా గాంధేయ మార్గంలోనే ఆందోళన చేశామని, ప్రభుత్వం దిగి రాకుంటే పార్లమెంటును ముట్టడించడానికి కూడా తాము సిద్ధమే అని అన్నారు. విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసేదాకా వదిలే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ప్రధానమంత్రి మోదీ ఒక అసమర్ధ ప్రభుత్వాన్ని నడుపుతున్నారని విమర్శించారు. ప్రజాస్వామ్య ప్రభుత్వాలు ఉన్న ఏ దేశంలో ప్రజాస్వామ్య విరుద్ధంగా ఇలా ప్రభుత్వాన్ని కొనసాగించడం దారుణమని అన్నారు. అందుకే ప్రభుత్వంతో విసిగి వేసారిన విద్యార్థులు ఆందోళనకు దిగారని, వారికి మద్దతుగా కాంగ్రెస్ పార్టీ ముందుకు నడుస్తుందని, వారికి



ధర్నాలో పాల్గొన్న ఎమ్మెల్యే శంకర్..

సమాధానం దొరకేదాకా తాము బాసటగా ఉంటామని వెల్లడించారు. ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ఆందోళన చేస్తున్న విద్యార్థులను లాఠీలతో కొట్టడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. గత ప్రభుత్వాలలో తప్పులు జరిగినప్పుడు మంత్రులు రాజీనామా చేశారని, కేవలం రైలు ప్రమాదం జరిగినందుకే నైతిక బాధ్యత వహిస్తూ లాల్ బహదూర్ లాంటివాళ్ళు రాజీనామాలు చేశారని గుర్తు చేశారు. అలాంటిది విద్యార్థులకు ఇంత అన్యాయం జరుగుతున్న ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయకపోవడం దురదృష్టకరమని పేర్కొన్నారు. ఇలా ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం పాలు చేస్తే ప్రతిపక్షాలు చూస్తూ ఊరుకోమని, పోరాటమే మార్గంగా ముందుకు సాగుతామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బస్వవేశర్,పట్టణ అధ్యక్షుడు నల్లమోని శ్రీధర్, మాజీ మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ విశ్వం,గిరిజన ఆదివాసీ రాష్ట్ర కో ఆర్డినేటర్ రఘు నాయక్, చెంది తిరుపతి రెడ్డి,మహ్మద్ ఇబ్రహీం, వివిధ మండల పార్టీ అధ్యక్షుడులు, ప్రతినిధులు, విద్యార్థులు, తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# విద్యార్థులపై లాఠీ చార్జి చేయడం అమానుషం

**వికారాబాద్, ప్రభాతవార్త :** నీట్ పేపర్ లీకేజీ పై ఢిల్లీలో విద్యార్థులు ధర్నా నిర్వహిస్తే వారిపై లాఠీచార్జి చేయడం అమానుష చర్య అని మున్సిపల్ చైర్‌పర్సన్ గద్దం అనన్య అన్నారు. ఢిల్లీ ఘటన, రాహుల్ గాంధీ అరెస్టు లకు వ్యతిరేకంగా వికారాబాద్ పట్టణంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో విద్యార్థులు, కాంగ్రెస్ నాయకులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ గద్దం అనన్య, మాట్లాడుతూ, నీట్ పరీక్ష అనేది కఠినమైనదని. తాను కూడా నీట్ వ్రాసానని, ఎంతో కష్టపడితే కానీ నీట్ సాధించలేమని అన్నారు. నీట్ పరీక్షలో మంచి ఫలితాలు సాధించాలనే ఉద్దేశంతో తల్లిదండ్రులు వారి పిల్లలకు ఎంతో ఖర్చు చేసి కోచింగ్ ఇప్పించడం జరుగుతుందని అన్నారు. విద్యార్థులు ఎంతో కష్టపడి తర్ఫీదునొంది నీట్ పరీక్ష రాస్తే, కేంద్ర ప్రభుత్వ వైఫల్యం వల్ల నీట్ ప్రశ్నా పత్రం లీక్ అయ్యిందని ఆరోపించారు. ఎంతో మంది నీట్ అభ్యర్థుల ఆశలు అడియాశలు అయ్యాయని కేంద్ర ప్రభుత్వంపై మండి పడ్డారు. కోట్ల మంది విద్యార్థులు భవిష్యత్తును కోల్పోయారని, ఈ విషయమై ఢిల్లీలో శాంతియుతంగా నిరసనలు తెలుపుతున్న విద్యార్థులపై హింసాత్మకంగా లాఠీచార్జి చేయడం అన్యాయమని, వారికి మద్దతుగా నిలిచిన తమ పార్టీ నేత రాహుల్ గాంధీని అరెస్టు చేయడం కేంద్ర



ఎన్టీఆర్ చౌరస్‌లో నిరసన కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ చైర్‌పర్సన్ గద్దం అనన్య

ప్రభుత్వ పైశాచిక చర్య అని ఉద్ఘాటించారు. నీట్ అభ్యర్థులకు క్షమాపణలు చెప్పడంతో పాటుగా నీట్ పేపర్ లీకేజీకి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు సతీష్‌రెడ్డి, శంకర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



శంషాబాద్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

### విద్యార్థుల తలలు పగలగొట్టడమే బిజెపి లక్ష్యమా..!

**శంషాబాద్ జులై 23, ప్రభాతవార్త :** దేశ రాజధానిలో జంతర్ మంతర్ వద్ద నీట్ యూజీ పరీక్షల అక్రమాలపై కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని కాక్రోచ్ జనతా పార్టీ మరియు విద్యార్థి సంఘాల విద్యార్థులు ఆందోళన చేస్తుంటే ఆ విద్యార్థులపై బిజెపి ప్రభుత్వం ధమనకాండ ప్రయోగించి లాఠీ ఛార్జ్ చేసి విద్యార్థుల తలలు పగలగొట్టడం బాష్ప వాయువు ప్రయోగించి విద్యార్థులను అణచివేయడం దేనికి నిదర్శనమని ఎస్ఎఫ్ఐ రంగారెడ్డి జిల్లా జిల్లా అధ్యక్షుడు కేవై ప్రణయ్. ఎన్ఎస్‌యుఐ నాయకులు జిల్లా ఆనంద్ కేంద్ర ప్రభుత్వాలపై మండిపడ్డారు. విద్యార్థులపై దాడిని ఖండిస్తూ గురువారం శంషాబాద్ లో ఎస్ఎఫ్ఐ-ఎన్ఎస్‌యుఐ ఆధ్వర్యంలో విద్యార్థులతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ....శాంతియుతంగా ఆందోళన చేస్తున్న విద్యార్థులపై లాఠీలు ప్రయోగించి విద్యార్థుల తలలు పగలగొట్టడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు ప్రసాద్, తనిష్క్, రుద్రాక్ష, శ్రీ హర్ష, నిహారిక, సాయి మనీష్, శివ రాథోడ్, ఎన్ఎస్‌యుఐ నాయకులు కర్ణాకర్,సుమన్ జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

### ఢిల్లీ పోలీసులు విచక్షణ కోల్పోతున్నారు

**వికారాబాద్, ప్రభాతవార్త :** ఇటీవల పార్లమెంట్ ముట్టడి సందర్భంగా విద్యార్థులు, యువతపై ఢిల్లీ పోలీసులు ప్రవర్తించిన తీరు తీవ్రంగా ఖండించదగినదని, ఈ ఘటన చాలా బాధాకరమని బీసీ కమీషన్ మాజీ సభ్యులు శుభప్రద్ పటేల్ అన్నారు. గతంలో తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమ సమయంలో కూడా తాము ఢిల్లీలో పార్లమెంట్ ముట్టడి, ప్రధాని, సోనియా గాంధీ నివాసాల వద్ద అనేక నిరసనలు, ధర్నాలు నిర్వహించినప్పటికీ, అప్పటి పోలీసులు ప్రజాస్వామ్యబద్ధంగా వ్యవహరించారని ఆయన గుర్తుచేశారు. ప్రస్తుతం కేంద్రంలోని మోదీ ప్రభుత్వ హయాంలో ఢిల్లీ పోలీసులు విచక్షణ కోల్పోయి విద్యార్థినులు, చిన్న పిల్లలు అని కూడా చూడకుండా దాడులు చేసి గాయపరచడం అత్యంత ఘోరమైన చర్య అని విమర్శించారు. విద్యార్థుల మరణాలకు, నీట్ పేపర్ లీకేజీలకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ప్రధాని మోదీ వెంటనే స్పందించి విద్యార్థులు, యువత సమస్యలను పరిష్కరించాలని అయన డిమాండ్ చేసారు.



### విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్న కేంద్రం

**ఘట్‌కేసర్, జులై 23, ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వం ప్రజాస్వామ్యానికి విరుద్దంగా అరెస్టులు, నిర్బంధాలతో నిరుద్యోగులను, ప్రతిపక్షనేతలను అణచివేయాలని ప్రయత్నిస్తుందని మేడ్చల్ డిసిసి అధ్యక్షులు తోటకూర వజ్రేశ్‌యాదవ్ అన్నారు. ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ అరెస్టును నిరశిస్తూ గురువారం ఘట్‌కేసర్‌లో కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో నిరసన జరిపారు. శివారెడ్డిగూడ నుంచి రహదారిపై అంబేద్కర్ విగ్రహం వరకు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు భారీ ర్యాలీ నిర్వహించారు. టిపిపిసి ప్రధాన కార్యదర్శి-సమన్వయకర్త గజ్జెల కాంతం, డిసిసి అధ్యక్షులు తోటకూర వజ్రేశ్‌యాదవ్, మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డిలు మోడి డౌన్ డౌన్ నినాదాలు చేస్తూ ర్యాలీలో పాల్గొన్నారు. అంబేద్కర్ విగ్రహానికి పూలదండ వేసి నివాళులు అర్పించిన అనంతరం వారు మాట్లాడారు. శాంతియుతంగా నిరసన జరిపిన నిరుద్యోగులుపై పోలీసులు పాశవికంగా లాఠీచార్జ్ చేయడం అమానుషమైన చర్య అన్నారు. ఆందోళన కారులకు మద్దతుగా వచ్చిన ఏఐసీసీ మాజీ అధ్యక్షులు-ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీపై ఆర్ఎస్ఎస్, విహెచ్‌పి గుండాలు దాడి చేసి అరెస్ట్ చేయించడం ప్రజాస్వామ్య విరుద్దమని పేర్కొన్నారు. నీట్ పరీక్షలో అనేక సార్లు ప్రశ్నాపత్రాలు లీకేజీ అయినా కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని ఎంతో కష్ట పడి చదివిన విద్యార్థులకు నష్టం జరుగుతుందని దీనికి బాధ్యులుగా కేంద్ర మానవవనరులశాఖ మంత్రి ధర్మేంద్రప్రధాన తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. నీట్ లీకేజీ ఆత్మహత్యలు చేసుకున్న విద్యార్థులకు, నిరాశ చెందిన విద్యార్థులకు కేంద్ర నష్ట పరిహారం చెల్లించాలన్నారుఈకార్యక్రమంలో డిసిసి ఉపాధ్యక్షులు వేముల మహేశ్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి ఇటిక్యాల బాలకృష్ణారెడ్డి, కార్యదర్శి మామిండ్ల ముత్యాలుయాదవ్, మాజీ మేయర్ తోటకూర అజయ్‌కుమార్ యాదవ్, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ముల్లి పావని యాదవ్, ఘట్‌కేసర్, పోచారం, ఎదులాబాద్ , మేడిపల్లి డివిజన్ల అధ్యక్షులు బొక్క ప్రభాకర్‌రెడ్డి, కర్రె రాజేశ్, సామల అమరేందర్, తుంగతుర్తి రవి, పోచారం మాజీ అధ్యక్షులు సింగిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, గడ్డిఅన్నారం మార్కెట్ డైరెక్టర్ చిల్కూరి మచ్చేందర్‌రెడ్డి, కీసరగుట్ట డైరెక్టర్ సగ్గు అనిత, కొమురవెల్లి ఆలయ సభ్యులు మెరుగు నరేశ్‌గౌడ్, ఆర్‌బిఎస్ మాజీ సమన్వయకర్త కొంతం అంజిరెడ్డి, మాజీ సర్పంచులు మెడబోయిన వెంకటేశ్, నానావత్ రూప్‌సింగ్‌నాయక్, మాజీ ఎంపిటిసిలు కందుల కుమార్, పులకంటి భాస్కర్‌రెడ్డి, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు బొమ్మక్ అజయ్, అసెంబ్లీ అధ్యక్షులు తోటకూర రాహుల్, మాజీ అధ్యక్షులు కొత్త శుశాంత్‌గౌడ్, మాజీ వార్డుసభ్యులు కంచర్ల వెంకట్‌రెడ్డి, గడీల సంజీవరెడ్డి, బర్ల దేవేందర్, కొరుబొతు నాగరాజు, రడమల్ల బోజిరెడ్డి, పసులాది నర్సింగ్‌రావు, ఎం.జంగయ్య, సొసైటీ మాజీ డైరెక్టర్ జవాజి సత్తయ్య, మహిళా కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు ఎర్ర మాధవి, నాయకులు పాలడుగు అమరేందర్‌రెడ్డి, కవాడి మాధవరెడ్డి, బర్ల రాధాకృష్ణ, మెట్టు గణేశ్‌యాదవ్, బి.నాగేశ్‌గౌడ్, ఎం.ఎ.ఫారూఖ్, బొక్క సత్తిరెడ్డి, మేకల సునీల్‌కుమార్, బద్దం నర్సింహ్మారెడ్డి, శ్రీనివాస్, సుధాకర్, ఎన్.శివాజీనాయక్, ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



విరాళం అందజేస్తున్న మున్సిపల్ చైర్మన్ జాము రవి

## ఆలయ పునర్నిర్మాణానికి రూ.55వేల విరాళం

**శామీర్‌పేట, జులై 23, ప్రభాతవార్త :** లక్ష్మాపూర్ గ్రామంలోని గడిమైసమ్మ ఆలయ పునర్నిర్మాణం కోసం మూడుచింతలపల్లి మున్సిపల్ చైర్మన్ జాము రవి రూ.55,555లు విరాళంగా ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. గురువారం మూడుచింతలపల్లి మున్సిపాల్టీలోని లక్ష్మాపూర్ గ్రామంలో గడిమైసమ్మ ఆలయ పున నిర్మాణం కోసం ఎంసిపల్లిలోని ఆయన ఆఫీస్ వద్ద విరాళంగా 55వేల555రూపాయలు ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగ చైర్మన్ జాము రవి మాట్లాడుతూ ఆలయాల అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు ఎప్పటికీ ఉంటాయని అన్నారు. ఆలయ పునర్నిర్మాణం విజయవంతంగా పూర్తి కావాలని ఆయన ఆకాంక్షను వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మూడుచింతలపల్లి గ్రామ నాయకులు వెంకట నర్సింహ్మారెడ్డి, లక్ష్మాపూర్ గ్రామ మాజీ ఎంపిటిసి నాగరాజు, మాజీ సర్పంచు సింగం అంజనేయులు, మాజీ ఉపసర్పంచ వైద్యనాథ్, గ్రామ నాయకులు శ్రీనివాస్‌గౌడ్, భాగయ్య, జగన్నాధం, సాయి శ్రీనివాస్‌చారి, చిత్తగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## గానుగాపూర్ దత్తాత్రేయ దర్శనానికి ప్రత్యేక బస్సు

**షాద్‌నగర్, జులై 23, ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్‌ఆర్టీసీ) షాద్‌నగర్ డిపో నుంచి గానుగాపూర్ శ్రీ దత్తాత్రేయ స్వామి దర్శనానికి ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ బస్సు సర్వీస్‌ను ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ తెలిపారు. ఈ ప్రత్యేక యాత్ర జులై 29, 2026న మధ్యాహ్నం 2 గంటలకు షాద్‌నగర్ డిపో నుంచి బయలుదేరి, మరుసటి రోజు ఉదయం 5 గంటలకు గానుగాపూర్ నుంచి తిరుగు ప్రయాణం ప్రారంభించి షాద్‌నగర్ చేరుకునే విధంగా ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఈ యాత్రకు ఒక్కొక్కరికి రూ.700 టికెట్ ధరగా నిర్ణయించినట్లు తెలిపారు. అయితే యాత్రలో పాల్గొనే భక్తులు వసతి, పలహారం, భోజన ఖర్చు లను ఎవరి వారు స్వయంగా భరించుకోవాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.టికెట్ బుకింగ్ మరియు ఇతర వివరాల కోసం 9959226287, 9182645281, 9440838985, 9491166785 నంబర్లను సంప్రదించాలని షాద్‌నగర్ డిపో మేనేజర్ సూచించారు.



దత్తాత్రేయ స్వామి ఆలయం

## బిజెపి కార్యవర్గ సమావేశ ఏర్పాట్లపై సమీక్ష

**షాద్‌నగర్, జులై 23, ప్రభాతవార్త :** శుక్రవారం జరగనున్న భారతీయ జనతా పార్టీ రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సమావేశానికి సంబంధించిన ఏర్పాట్లను బీజేపీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు పంతంగి రాజ భూపాల్ గౌడ్ సమీక్షించారు. ఈ సందర్భంగా పంతంగి రాజ భూపాల్ గౌడ్ మాట్లాడుతూ జిల్లా కార్యవర్గ సమావేశం పార్టీ సంస్థాగత బలోపేతానికి, భవిష్యత్ కార్యాచరణకు దిశానిర్దేశం చేసే కీలక సమావేశమని అన్నారు. పార్టీ నాయకులు, జిల్లా కార్యవర్గ సభ్యులు, మండల అధ్యక్షులు, ముఖ్య నాయకులు సమయానికి హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు నెల్లి శ్రీ వర్ధన్ రెడ్డి, అందే బాబయ్య, కక్కునూరి వెంకటేష్ గుప్తా, ఎలిమేటి దేవేందర్ రెడ్డి, వై. నారాయణ యాదవ్, మల్లేష్ యాదవ్, మల్లారెడ్డి, అమలాపురం నర్సింలు గౌడ్, కృష్ణ గౌడ్, శేఖర్, శ్రీధర్ రెడ్డి, ఇసునాది శ్రీనివాస్, నవీన్ మాల, కందూరు మనోహర్ రెడ్డి, మల్చల్ మురళి, కావాలి యాదయ్య తదితరులు, బీజేపీ జిల్లా నాయకులు, మండల అధ్యక్షులు చిట్టెం లక్ష్మీకాంత్ రెడ్డి, ఎదిర రాజు, పిట్టల సురేష్, మహేందర్ రెడ్డి, శ్రీనివాస్ చారి తదితర ముఖ్య నాయకులు పాల్గొని సమావేశ ఏర్పాట్లను పరిశీలించారు.

# జర పట్టించుకోండి!

## పాఠశాల భవనం కూలుతోంది...

**షాద్‌నగర్, జులై 23, ప్రభాతవార్త :** కిషన్‌నగర్ గ్రామంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భవనం శిథిలావస్థకు చేరిందని, ఎప్పుడు కూలిపోతుందో తెలియని పరిస్థితుల్లో విద్యార్థులు భయాందోళనల మధ్య చదువులు కొనసాగిస్తున్నారని గ్రామ పెద్దలు ఆవేదన వ్యక్తం చేశారు. పాఠశాల భవనం దుస్థితిపై తక్షణమే స్పందించి నూతన భవనం నిర్మించాలని కోరుతూ పెద్ద ఎత్తున గ్రామస్తులు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి చేరుకుని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను ప్రత్యేకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. శిథిలమైన భవనంలో విద్యార్థులు ప్రతిరోజూ బిక్కుబిక్కు మంటూ చదువుకోవాల్సి వస్తోందని తెలిపారు. విద్యార్థుల భద్రతను దృష్టిలో ఉంచుకుని ఎలాగైనా నూతన పాఠశాల భవనాన్ని నిర్మించాలని ఎమ్మెల్యేను కోరారు. గత గ్రామపంచాయతీ పాలకుల హయాంలో పాఠశాల మరమ్మతుల కోసం గత ప్రభుత్వం రూ.49 లక్షలు మంజూరు చేసినప్పటికీ, పనులు చేపట్టకుండా ఆ నిధులకు సంబం ధించిన ప్రొసీడింగ్స్‌ను తిరిగి పంపించారని గ్రామస్తులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఇప్పటికైనా పాఠశాల భవన నిర్మాణం లేదా మరమ్మతులకు చర్యలు తీసుకుని విద్యార్థులకు భద్రమైన వాతావరణం కల్పించాలని విజ్ఞప్తి చేశారు .గ్రామస్తుల వినతిని స్వీకరించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ స్పందిస్తూ.. పాఠశాల భవనం సమస్యను ప్రభుత్వం దృష్టికి తప్పకుండా తీసుకెళ్లి, విద్యార్థులకు న్యాయం జరిగేలా తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో



ఎమ్మెల్యే శంకర్‌కు వినతి పత్రం అందజేస్తున్న గ్రామస్తులు..

సర్పంచ్ నల్ల నర్సమ్మ నరసింహులు, ఉప సర్పంచ్ ముక్కు పోగుల ప్రకాష్ గౌడ్, మాజీ ఎంపీటీసీ కట్ట వెంకటేష్ గౌడ్, ప్రధానోపాధ్యాయులు ఇన్‌చార్జి శ్రీనివాస్, మిద్దెల విక్రమ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE PRL. SENIOR CIVIL JUDGE, MEDCHEL-MALKAJGIRI DISTRICT, AT: KUSHAIGUDA
O.S.NO. 435 OF 2026

BETWEEN:
Thummanapally Swayam, S/o. Late Thummanapally Yadagiri Rao,Aged about: 21 years, Occ: House wife, R/o. H.No.11-398, Dangaragalli, Brahumpur, Gulbarga, Karnataka State.
... Plaintiff.

AND
01. The Tahasildar, Malkajgiri Mandal, Medchel-Malkajgiri District.
02. The Tahasildar, Kapra Mandal, Medchel-Malkajgiri District.
03. The Tahasildar, Ibrahim Patnam Mandal, Ranga Reddy District.
04. All Concerned
....Defendants

NOTICE

To
D-4) All Concerned,
WHEREAS the above-named plaintiff have herein filed the above suit for declaring the plaintiff as Legal heir of late Thummanapally Yadagiri Rao, S/o. T.Narsimha Rao in respect of the
SCHEDULE OF PROPERTY:
SCHEDULE-'D': That the Open Plot Unit No. HDL-39, an admeasuring area 240 Sq. yards or 200.67 Sq. Mtrs in H-Phase, in Sy. No. 482/ E, EE, Dream City-II(Sagar Block), Situated at Raipole Village, Ibrahimpatnam Mandal, Ranga Reddy District under the Gram Panchayat of Raipole Village, SRO at Ibrahimpatnam, Ranga Reddy District and bounded as; North by : Unit No. HDL-40, South by : Unit No. HDL-38, East by : Unit No. HDL-28, West by : 33'-Wide Road,
Please take notice that the suit stands posted to 17-08-2026 for your appearance. If having any objections from anybody may appear before the Hon'ble Prl. Senior Civil Judge, Medchel-Malkajgiri District, at Kushaiguda on 17-08-2026 at 10.30am either in person or through your Counsel along with documentary evidence, if any file the same before the said Hon'ble Court. In case of no objections from anybody the Hon'ble Court shall be granted the relief claimed by the Plaintiff as per the material on record.

// BY ORDER OF THE COURT //
Sd/-, VENKATESHWARLU DASARI
CH VENKAT REDDY
Advocates
Office # Flat No.502, Block No. B-05, Sahabhavana Township, Anandnagar, Bandlaguda, Nagole, Medchel-Malkajgiri-68. Phone No. 8247545074.

IN THE COURT OF THE PRL. SENIOR CIVIL JUDGE, MEDCHEL-MALKAJGIRI DISTRICT, AT: KUSHAIGUDA
O.S.NO. 435 OF 2026

BETWEEN:
Thummanapally Swayam, S/o. Late Thummanapally Yadagiri Rao, Aged about: 21 years, Occ: House wife, R/o. H.No.11-398, Dangaragalli, Brahumpur, Gulbarga, Karnataka State.
... Plaintiff.

AND
01. The Tahasildar, Malkajgiri Mandal, Medchel-Malkajgiri District.
02. The Tahasildar, Kapra Mandal, Medchel-Malkajgiri District.
03. The Tahasildar, Ibrahim Patnam Mandal, Ranga Reddy District.
04. All Concerned
....Defendants

NOTICE

To
D-4) All Concerned,
WHEREAS the above-named plaintiff have herein filed the above suit for declaring the plaintiff as Legal heir of late Thummanapally Yadagiri Rao, S/o. T.Narsimha Rao in respect of the
SCHEDULE OF PROPERTIES:
SCHEDULE-'A': All that the Semi-Finished Residential Double Bed Rooms UNIT No. 103 in the 1st Floor of "Jayashree Plaza", Consisting of 900.00 Sq. Feet of Built up area, including all common and general parking areas, associated with an undivided land share of 28.00 Sq. yards or 23.41 Sq. Mtrs. (Out of 266.66 Sq. yards or 222.98 Sq. Mtrs), in H.No. 30-1575/1 (Old No. 30-167/10) on Plot No. 10 in Sy. Nos. 68/1, 70/1 & 71,Situated at Chandragiri Colony, Neredmet, Under Malkajgiri Municipality &Mandal, Medchel-Malkgiri District (Formerly Ranga Reddy District) and bounded as: North by; Unit No. 102, South by : Open to Sky, East by : Open to sky & Corridor, West by : Open to Sky. SCHEDULE-'B': That the Open Plot bearing No.27 (Covered under Block No.2), in Sy. No. 57/1, an admeasuring 225 Sq. yards or 188.1 Sq.Mtrs, Situated at Yellareddyguda, Under Kapra Municipality, Keesara Mandal, Ranga Reddy District, Presently Medchel-Malkajgiri District, after that the constructed a residential and bounded as follows:North by : 30'-00" Wide Road,South by : Plot No. 28, East by : 20'-00" Wide Road, West by : Plot No. 20. SCHEDULE-'C': That the Shop bearing No. G3, Consisting 231 sft. Of buildt up area, in ground floor of the Building "Sri Sai Venkateshwara Residency", on Plot Nos. 53 & 54, with an undivided share of 6.16 Sq yards or 5.14 Sq Mtrs. out of 628.88 Sq yards or 525.74 Sq.Mtrs., together with 120 sft of earmarked parking place in the parking area provided thereto, Sy. Nos. 74 and 75, Situated at L.B. Nagar, within the limits of Malkajgiri Municipality, RR District., Presently Medchel-Malkajgiri District and This Shop bounded as: The Shop Bounded by: North by : Shop No.G2, South by : Shop No. G4, East by : Approach Passage, West by : Corridor, The Building Bounded by: North by : House on Plot No. 55, South by : House on Plot No. 52, East by : Road No 66'.0" Wide Road, West by : House on Plot Nos. 39 & 40.
Please take notice that the suit stands posted to 17-08-2026 for your appearance. If having any objections from anybody may appear before the Hon'ble Prl. Senior Civil Judge, Medchel-Malkajgiri District, at Kushaiguda on 17-08-2026 at 10.30 am either in person or through your Counsel along with documentary evidence, if any file the same before the said Hon'ble Court. In case of no objections from anybody, the Hon'ble Court shall be granted the relief claimed by the Plaintiff as per the material on record.

// BY ORDER OF THE COURT //
Sd/-, VENKATESHWARLU DASARI
CH VENKAT REDDY
Advocates
Office # Flat No.502, Block No. B-05, Sahabhavana Township, Anandnagar, Bandlaguda, Nagole, Medchel-Malkajgiri-68. Phone No. 8247545074.

## ఆసుపత్రిలో చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

**ఘట్‌కేసర్, జులై 23, ప్రభాతవార్త:** రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆసుపత్రిలలో చికిత్స పొందుతూ ఓవృద్ధురాలి మృతిచెందిన సంఘటన ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. యాదాద్రిభువనగిరి జిల్లా పోచంపల్లికి చెందిన భార్యాభర్తలు మణెమ్మ, మల్లయ్యలు ఈనెల 19న ఉదయం 10:40 గంటలకు టివిఎస్ బైక్‌పై పోచంపల్లి నుంచి హైదరాబాద్‌కు వెళ్లుండగా అవుషాపూర్‌లోని చెన్నపట్నం కాఫీ హోటల్ వద్దకు రాగానే టివిఎస్ అదుపుతప్పి జారిపడగా కిందపడ్డారు. దీంతో మణెమ్మ (54) తలకు తీవ్రగాయం కావడంతో 108 అంబులెన్సులో మేడిపల్లిలోని కాకతీయ ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స చేయంచగా మెరుగైన వైద్యం కోసం గాంధీ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. మణెమ్మ ఆరోగ్య పరిస్థితి విషమించడంతో ఈనెల 22న మధ్యాహ్నం 3:13 గంటలకు చనిపోయిందని వైద్యులు పరీక్షించి నిర్ధారించారు. మృతురాలి కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నామని ఘట్‌కేసర్ ఇన్‌స్పెక్టర్ బాలస్వామి తెలిపారు.


మేడ్చల్‌లో ప్రధానమంత్రి నరేంద్రమోదీ దిష్టిబొమ్మను దగ్ధం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

## బెదిరింపులతో ప్రజల గొంతును అణచివేయలేరు

**మేడ్చల్, జులై 23. ప్రభాతవార్త :** కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, ప్రియాంక గాంధీతో పాటు ప్రతిపక్ష నాయకుల అరెస్టును ఖండిస్తూ మేడ్చల్ పట్టణంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దిష్టిబొమ్మను కాంగ్రెస్ నాయకులు దగ్ధం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ ప్రజాస్వామ్య విలువలు, రాజ్యాంగ పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ప్రజల పక్షాన నిలబడుతుందని, నిర్బంధాలు, బెదిరింపులతో ప్రజల గొంతును అణచివేయలేరని అన్నారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్, కిష్టాపూర్ పూడూర్, గుండ్లపోచంపల్లి డివిజన్ల కాంగ్రెస్ అధ్యక్షులు నాగరాజు ముదిరాజ్, రొయ్యపల్లి మల్లేష్ గౌడ్, సురేందర్ ముదిరాజ్, ఎల్లంపేట్ మున్సిపల్ పార్టీ అధ్యక్షుడు విఘ్నేశ్వర్ రెడ్డి, మేడ్చల్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ చీర్ల రమేష్ కురుమ, నాయకులు రాజు, జాకట దేవరాజ్, మహేష్ కురుమ, సాయి కుమార్, పాలకుర్తి రాఘవేందర్ గౌడ్, రవీందర్ రెడ్డి, శ్రావణ్ కుమార్ గుప్తా, రవి ముదిరాజ్, గోమారం బాల్ రెడ్డి, శివ కుమార్, అయూబ్ ఖాన్, యూసుఫ్, షాహీన్ పాషా, రామన్నగారి రాఘవేందర్ గౌడ్, రంజిత్ ముదిరాజ్, దుర్గం వెంకటేష్ ముదిరాజ్, మేకల రాజశేఖర్ రెడ్డి, నడికొప్పు బాల మల్లేష్ ముదిరాజ్, సత్యనారాయణ, రమణా రెడ్డి, ఈశ్వర్, దుబ్బ రామస్వామి ముదిరాజ్, యాదగిరి, పేరదా రెడ్డి, సంజీవ రావు, దొడ్ల మోహన్ ముదిరాజ్, ప్రకాష్ రెడ్డి, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ప్రేమలత తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులపై అకారణంగా దౌర్జన్యకాండకు పాల్పడింది


విలేకరులతో మాట్లాడుతున్న ఎండి ఫరీద్

**ఆమనగల్లు, జులై23, ప్రభాతవార్త:** నీట్ ఎగ్జామ్ పేపర్ లీక్‌పై నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులపై జరిగిన లాఠీఛార్జీ ఘటనను నిరసిస్తూ నేడు శుక్రవారం విద్యాసంస్థల బంద్‌కు పిలుపునిస్తున్నట్లు ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి ఎండి ఫరీద్ అన్నారు. ఎన్ఎస్‌యూఐ, ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్ఐ, పిడీఎస్‌యూ, ఏఐఎఫ్‌డిఎస్, ఏఐఎస్‌బి, ఏఐపిఎస్‌యుతోపాటు వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో విద్యాసంస్థల బంద్ నిర్వహిస్తున్నట్లు ఆయన వివరించారు. గురువారం ఆమనగల్లు పట్టణంలో ఫరీద్ స్థానిక ఎన్ఎస్‌యూఐ నాయకులతో కలిసి స్థానిక విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, ఎంపి రాహుల్‌గాంధీ విద్యార్థులకు సంఘీభావం వ్యక్తం చేసి నిరసనలో పాల్గొంటే కేంద్ర ప్రభుత్వం అప్రజాస్వామిక బద్ధంగా అరెస్టు చేసిందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం విద్యారంగాన్ని పూర్తిగా భ్రష్టు పట్టించిందని, విద్యార్థులు ఎన్నో కలలతో నీట్ ఎగ్జామ్‌కు సన్నద్ధమై పరీక్షలు రాస్తే ఎన్‌టీఏ నిర్లక్ష్యధోరణితో ఎగ్జామ్ పేపర్ లీక్ అయిందని ఆరోపించారు. పేపర్ లీక్‌కు కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ బాధ్యత వహించాలని దేశ రాజధానిలో విద్యార్థులు సామరస్యంగా ఆందోళనలను చేపడితే కేంద్ర ప్రభుత్వం విద్యార్థులపై అకారణంగా దౌర్జన్యకాండకు పాల్పడిందని ఎండి ఫరీద్ మండిపడ్డారు. ఇందుకు నిరసనగా విద్యార్థులకు మద్దతుగా పలు విద్యార్థి సంఘాలు విద్యాసంస్థల బంద్ పిలుపునిచ్చినట్లు ఆయన వివరించారు. పాఠశాలలు, కళాశాలలు, ఇతర విద్యాసంస్థలు స్వచ్ఛందంగా బంద్ పాటించి విద్యార్థులకు మద్దతు తెలపాలని ఆయన కోరారు. కార్యక్రమంలో నాయకులు మహేశ్, సలీం, గణేశ్, అబ్దుల్ తదితరులు ఉన్నారు.

## విద్యార్థులపై దాడికి యువజన కాంగ్రెస్ నిరసన

**తలకొండపల్లి, జులై23, ప్రభాతవార్త:**

విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ దేశ రాజధాని ఢిల్లీలో విద్యార్థులు పాల్గొని నిరసన తెలుపుతుంటే పోలీసులచే వారిపై లాఠీ ఛార్జ్ చేయించి ఒకరు మృతికి కేంద్ర ప్రభుత్వం కారణమైందని కేంద్ర ప్రభుత్వానికి నిరసనగా గురువారం నాడు తలకొండపల్లి మండల కేంద్రంలో యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. నీటు పరీక్షలో కేంద్ర ప్రభుత్వం కేంద్ర మంత్రిని వెనకేసుకొస్తుందని, అతని రాజీనామా చేయాలని కోరుతూ పార్లమెంట్లో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ నిరసన తెలిపితే అతనిపై దాడి చేయడం ఏమిటని వారు ప్రశ్నించారు. బిజెపి పాలనలో జాతీయస్థాయి పరీక్షల్లో కేంద్ర ప్రభుత్వం విశ్వసనీయత కోల్పోయిందని స్వతంత్ర సంస్థతో విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, రాహుల్ గాంధీ పై అరెస్ట్ చేయడం బాధాకరమని వెంటనే అందరిపై కేసులు ఎత్తివేసి చర్యలు చేపట్టాలని ఆరు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు రవీందర్ కృష్ణ భవన్ రెడ్డి తదితరులు ఉన్నారు.

## నీట్ పేపర్ లీకేజీ రచ్చ

**కేశంపేట, జులై 23, ప్రభాతవార్త :** నీట్ పరీక్షల లీకేజీ వ్యవహారంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేపట్టిన నిరసన కార్యక్రమంలో విద్యార్థులపై పోలీసులు దారుణంగా లాఠీచార్జ్ చేయడాన్ని నిరసిస్తూ గురువారం కేశంపేట మండల కేంద్రంలో కాంగ్రెస్ శ్రేణులు భారీ ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ కేశంపేట మండల అధ్యక్షుడు అనుమగళ్ల రమేష్ ఆధ్వర్యంలో, మాజీ జడ్పిటిసి తాండ్ర విశాల శ్రవణ్ రెడ్డి ముఖ్య భాగస్వామ్యంతో ఈ నిరసన కార్యక్రమం హోరెత్తింది.

**ప్రధాన డిమాండ్లు విమర్శలు:**

**విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలు:** లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకుంటున్న ఎన్ఈఈటి లీకేజీపై న్యాయం అడిగితే విద్యార్థులపై లాఠీలు ఝుళిపించడం దారుణమని నాయకులు మండిపడ్డారు.

**పోలీసుల దౌర్జన్యం నశించాలి:** శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులపై లాఠీచార్జ్ చేసిన బాధ్యులైన అధికారులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాహుల్ గాంధీతో పాటు అరెస్టు కాబడిన కాంగ్రెస్ నాయకులనుపై నమోదైన కేసులను వెంటనే భేషరతుగా ఎత్తివేయాలని వారు కేంద్రప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కేశంపేట మండల పరిధిలోని కాంగ్రెస్ నాయకులు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## నీట్ పేపర్ లీకేజీపై రాష్ట్రవ్యాప్త విద్యాసంస్థల బంద్‌కు ఎన్ఎస్‌యుఐ పిలుపు


సమావేశంలో మాట్లాడుతున్న ఎన్ఎస్‌యుఐ నాయకులు

**కేశంపేట ,జులై 23, ప్రభాతవార్త :**నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ వ్యవహారాన్ని నిరసిస్తూ, విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలని డిమాండ్ చేస్తూ నేడు శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా విద్యాసంస్థల బంద్‌కు ఎన్ఎస్ యుఐ పిలుపునిచ్చిందని కేశంపేట మండల ఎన్ఎస్‌యుఐ నాయకులు ప్రకటనల్లో తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ బంద్‌ను విజయవంతం చేయడానికి విద్యార్థులు, విద్యాసంస్థల యాజమాన్యాలు, ప్రజలు సహకరించాలని వారు కోరారు. నీట్ పేపర్ లీకేజీపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కేశంపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అనుమగల్ల రమేష్, సర్పంచ్ భాస్కర్, ఎన్ఎస్‌యుఐ యూత్ కాంగ్రెస్ నాయకులు యండి. అమేర్, లింగం, అజహార్, రాజేష్, శ్రీకాంత్, సచిన్, రాజు తదితర నాయకులు పాల్గొన్నారు.

# కాప్రా మండల పరిధిలో అక్రమ కట్టడాల కూల్చివేత

**జవహార్‌నగర్, జులై 23, ప్రభాత వార్త:** కాప్రా మండల పరిధిలోని జవహార్‌నగర్ ప్రాంతంలో ప్రభుత్వ భూములపై అక్రమంగా నిర్మించిన కట్టడాలను రెవెన్యూ అధికారులు గురువారం జేసీబీ సాయంతో కూల్చివేశారు. కాప్రా తహసీల్దార్ మతిన్ ఆదేశాల మేరకు గిర్దావర్ సత్యనారాయణ పర్యవేక్షణలో ఈ చర్యలు చేపట్టారు. సర్వే నెంబర్లు 584, 611, 827 పరిధిలోని వికలాంగుల కాలనీ, బీరప్పగడ్డ, మోహన్‌రావు కాలనీ, ప్రగతి నగర్ వాటర్ ట్యాంక్ సమీపం, జీడీ తోట, బీజేఆర్ నగర్ ప్రాంతాల్లో ప్రభుత్వ భూములను ఆక్రమించి నిర్మించిన అక్రమ కట్టడాలను తొలగించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మతిన్ మాట్లాడుతూ, జవహార్‌నగర్‌లోని ప్రభుత్వ భూముల్లో ఎలాంటి నిర్మాణాలు చేపట్టరాదని హెచ్చరించారు.



ప్రభుత్వ భూములను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. ప్రభుత్వభూములను అమాయక పేదలకు విక్రయిస్తూ అక్రమంగా సొమ్ము చేసుకుంటున్న వ్యక్తులపై ప్రత్యేక నిఘా పెట్టామని, వారిపై త్వరలోనే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రభుత్వ భూముల పరిరక్షణే తమ ప్రధాన లక్ష్యమని, ప్రభుత్వ స్థలాల్లో ఎలాంటి ఆక్రమణలు, నిర్మాణాలు జరగకుండా నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# రైతులను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యం

**కుల్కచర్ల, జులై 23, ప్రభాతవార్త:** రైతులను అన్ని రంగాలో అభివృద్ధి చేయడమే లక్ష్యమని ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని పిఏసిఎస్ కార్యాలయంలో పలు గ్రామాలకుచెందిన 16 మంది రైతులకు మంజురైన చెక్కులను ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి ,పిఏసిఎస్ చైర్మన్ భీంరెడ్డి స్థానిక నాయకులతో కలిసి రైతులకు పంపిణి చేశారు. ఈ సందర్బగా ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ...రైతుల అభివృద్ధికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని సహకార సంఘాల ద్వారా అందిస్తూన్న రుణాలు రైతులకు ఎంతో తోడ్పాతాయని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులు ఎంతో కృషిచేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటి చైర్మన్ ఆంజనేయులు, వైస్ చైర్మన్ ఆశోక్ కుమార్, మండల అధ్యక్షులు గోపాల్ నాయక్, చౌడపూర్ మండల అధ్యక్షులు చంద్రశేఖర్, మాజి ఎంపిపి సత్యహరిచందర్, సినియర్ నాయకులు కృష్ణ రెడ్డి, అయా గ్రామాల సర్పంచులు, కమిటి సభ్యులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.


రైతులకు చెక్కులు పంపిణి చేస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి

## విద్యాశాఖ మంత్రిని బర్తరఫ్ చేయాలి

**జవహార్ నగర్, జులై 23, ప్రభాత వార్త:**నీట్ పేపర్ లీకేజీతో విద్యార్థుల భవిష్యత్తును కేంద్ర ప్రభుత్వం ప్రమాదంలోకి నెట్టిందని, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ నైతిక బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాలని, లేదంటే వెంటనే బర్తరఫ్ చేయాలని జవహార్‌నగర్ మాజీ మేయర్ శాంతి కోటేష్ గౌడ్, చంద్రపురి కాలనీ డివిజన్ అధ్యక్షుడు మల్లెపూల శ్రీకాంత్ యాదవ్ డిమాండ్ చేశారు.

మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కీసర సర్కిల్ జవహార్‌నగర్ బాలాజీనగర్ అంబేద్కర్ విగ్రహం వద్ద గురువారం ఏఐసీసీ, టీపీసీసీ పిలుపు మేరకు కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ మేయర్ శాంతి కోటేష్ గౌడ్, శ్రీకాంత్ యాదవ్ నాయకత్వం వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, నీట్ పేపర్ లీకేజీ ఘటనతో లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందన్నారు. ఈ ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, లేదంటే ప్రధాని వెంటనే ఆయనను బర్తరఫ్ చేసి పేపర్ లీకేజీకి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దేశ అభివృద్ధిలో యువత, విద్యార్థుల పాత్ర కీలకమని, అలాంటి విద్యార్థుల భవిష్యత్తుతో కేంద్ర ప్రభుత్వం చెలగాటమాడడం అత్యంత బాధాకరమని అన్నారు. కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీతో పాటు పలువురు నాయకులను అరెస్టు చేయడాన్ని కూడా తీవ్రంగా ఖండించారు. ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్, మాజీ సర్పంచ్ కారంగుల శంకర్ గౌడ్, మాజీ కార్పొరేటర్లు గొడుగు వేణు, జమాల్పూర్ నవీన్ కుమార్, బింగి సతీష్ గౌడ్, మాట్ల వినయ్ కుమార్, నాయకులు రజిత గోపాల్, గండి సునీత, బొబ్బిలి మంజుల, భాగ్య, సుగుణ, రేసు లక్ష్మి, సూరమ్మ, రాజు గౌడ్, ఎర్రగుడ్ల వెంకటేశ్వర్లు, సాయి, కృష్ణ, శ్రీనివాస్, గజ్వేల్ శంకర్, రాజు యాదవ్, మాధవరెడ్డి, పద్మారావు, మల్లికార్జున్, విజయ్, సాయి తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు తదితరులు

## 90శాతం పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోవాలి

**తహశిల్దారు విజయ్‌కుమార్**

**పూడూరు, జులై 23, ప్రభాతవార్త :** గ్రామాల్లో నిర్వహించే ఓటరు జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియను వారంరోజుల్లో 90శాతం పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని తహశీల్దారు విజయ్‌కుమార్ పేర్కొన్నారు .గురువారం పూడూరు మండల పరిషత్తు కార్యాలయంలో బిఎల్‌ఓ, బిఎల్ఎ, సూపర్‌వైజర్లకు ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్ 2026)పై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎఎస్‌డి లిస్టును తయారు చేసి సన్నద్ధంగా ఉండాలని వివరిం చారు. దూరప్రాంతాల్లో ఉన్న ఓటర్లను గుర్తించి పూర్తి సమాచారం తీసు కోవాలని సూచించారు. ప్రత్యేక ఓటరు జాబితా సవరణ, ఫారాల నిర్వహణ, ఇంటింటి సర్వే, అర్హులైన ఓటర్ల నమోదు, తొలగింపులు, ఇతర ఎన్నికల సంబంధిత అంశాలపై సమగ్రంగా అవగాహన కల్పించారు. ఈ కార్య క్రమంలో ఉప తహశీల్దారు వీరేష్‌బాబు, ఎలక్షన్ డిటి అనీల్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ కుటిల రాజకీయాలకు కాలం చెల్లింది

**-చేవెళ్ల మాజీ ఏమ్మేల్యే కెఎస్ రత్నం**

**చేవెళ్ల, జులై 23, ప్రభాతవార్త :**

దేశంలో యువతను తప్పుదోవ పట్టిస్తూ రాజకీయ అస్థిరత సృష్టించేందుకు కాంగ్రెస్ పార్టీ ప్రయత్నిస్తుందని, కాంగ్రెస్ కుటిల రాజకీయాలకు కాలం చెల్లిందని చేవెళ్ల మాజీ ఏమ్మేల్యే కెఎస్ రత్నం అన్నారు. గురువారం చేవెళ్ల మండల కేంద్రంలో బిజెపి ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఆనంతరం రాహుల్ గాంధీ దిష్టి బొమ్మను దహనం చేశారు. అందోళన చేసిన బిజెపి నాయకులను చేవెళ్ల పోలీసుల అరెస్ట్ చేశారు. ఈ సందర్బంగా ఏర్పాటు చేసిన సమావేశంలో చేవెళ్ల మాజీ ఏమ్మేల్యే కెఎస్ రత్నం మాట్లాడుతూ దేశ రాజ్యాంగ వ్యవస్థను, సార్వభౌమాధికారాన్ని కాపాడేందుకు దేశ యువత ఎల్లప్పుడు ముందుండాలన్నారు. ఢిల్లీలో జరిగిన పరిణామాలు నీట్ పరీక్షకు సంబందించిన సమస్యపై ప్రారంభమైన నిరసన పక్కదారి పట్టిందన్నారు. నిరసనల్లో కొన్ని వివాదస్పద నినాదాలు వాఖ్యలు ఎందుకు చేస్తున్నారో సమాధానం చెప్పాలన్నారు. పార్లమెంట్ ముట్టడికి ఎందుకు ప్రయత్నించారన్నారు. యువతను అడ్డం పెట్టుకుని కొందరు స్వార్దపూరిత రాజకీయ ప్రయోజనాల కోసం ఉద్యమాలను పక్కదారి పట్టిస్తున్నారన్నారు. దేశంలో శాంతి భద్రతలకు భంగం కల్గించేలా రాజకీయ అస్థిరత సృష్టంచే ప్రయత్నాలను ప్రజలు యువత తిప్పికొట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రకార్యవర్గ సభ్యులు డాక్టర్ కె.శ్రీశైలం యాదవ్, సీనియర్ నాయకులు ఇక్కరెడ్డిగూడ వెంకట్‌రెడ్డి, చేవెళ్ల మునిసిపల్ అధ్యక్షుడు అనంత రెడ్డి, మొయినాబాద్ మునిసిపల్ అధ్యక్షులు శ్రీకాంత్, మొయినాబాద్ మండల అధ్యక్షులు చంద్రశేఖర్ రెడ్డి, షాబాద్ మండల అధ్యక్షులు మనయ్య, శంకరపల్లి మండల అధ్యక్షుడు లీలావతి బయానంద్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డా వైభవ్ రెడ్డి, కె.మహేందర్, కార్యకర్తలు నాయకులు పెద్దఎత్తున పాల్గొన్నారు .


చేవెళ్లలో ధర్నా చేస్తున్న బిజెపి నాయకులు

## నీట్ దోషులను శిక్షించాలి

**-చేవెళ్ళ మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్**

**చేవెళ్ల, జులై23, ప్రభాతవార్త:**

కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని చేవెళ్ళ మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. ప్రతిపక్ష నేత, ఎంపీ రాహుల్ గాంధీ అక్రమ అరెస్ట్ కు నిరసనగా, ఢిల్లీలో విద్యార్థులపై జరుగుతున్న మారణ హోమానికి వ్యతిరేకంగా చేవెళ్ల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం చేవెళ్ల మండల కేంద్రంలో దర్నా అందోళన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చేవెళ్ల కాంగ్రెస్ పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విద్యార్థి జీవితాలతో చెలగాట మాడుతుందన్నారు. బిజెపి ప్రభుత్వ హయాంలో ఇప్పటివరకు 152 రెండుసార్లు పేపర్ లీకేజ్‌తో రికార్డులు సాధించారన్నారు. 7.5 కోట్ల విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతుంది కేంద్ర ప్రభుత్వం పేపర్ లికేజ్ లకు పాల్పడుతున్న దోషులను కఠినంగా శిక్షించాలని, ప్రధాని నరేంద్ర మోడీ దోషులను కాపాడుకునేందుకు బీజేపీ నాయకులు రోడ్లపై ధర్నాలు చేయడం విడ్డురంగా ఉందన్నారు. దేశ చరిత్రలో లక్షన్నర కోట్ల రూపాయలు విద్యార్థుల తల్లిదండ్రుల ప్రజల సొమ్ము నష్టపోయారన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు రోడ్డుపై కొచ్చి నిరసన వ్యక్తం చేస్తే వారిపై దాడి చేయడం బాధాకరమని, నష్టపోయిన విద్యార్థి కుటుంబాలకు నష్టపరిహారం చెల్లించాలని. విద్యార్థులపై ఉన్న అక్రమ కేసులను ఎత్తివేలని. పేపర్ లీకేజీకి కారణమైన విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలన్నారు. పేపర్ లీకేజ్‌కి సహకరించినటువంటి ద్రోహులను కేంద్ర ప్రభుత్వం కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ క్యాంపెయిన్ కమిటీ కన్వీనర్ వసంతం, చేవెళ్ల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గిరిధర్ రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ సమతా వెంకటరెడ్డి,

పిఏసిఎస్ చైర్మన్ ప్రతాప్ రెడ్డి, మాజీ మండల పార్టీ అధ్యక్షులు వీరేందర్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ పెంటయ్య గౌడ్, వైస్ చైర్మన్ రాములు, మున్సిపల్ వైస్ చైర్మన్ రాము గౌడ్, కౌన్సిలర్లు గోపాల్ రెడ్డి, నర్సింలు, సర్పంచులు శ్రీనివాస్ గౌడ్, రామచంద్రయ్య గౌడ్, మహిపాల్ రెడ్డి, శ్రీనివాస్, రామస్వామి, బుచ్చయ్య, నాయకులు పడాల ప్రభాకర్, రాములు సాయి రెడ్డి, రాజశేఖర్, రామ్ రెడ్డి, భూపాల్ గౌడ్, మాణిక్యం, కరికె మల్లేష్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు కార్తీక్ రెడ్డి, మహేశ్వర్ రెడ్డి, అబ్దుల్ గణి, జావేద్ తదితరులు పాల్గొన్నారు.


కొత్తూరులో నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నేతలు

**పోచారం డివిజన్‌లో యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో**

## కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా ధర్నా

**ఘట్‌కేసర్ రూరల్, జులై 23, ప్రభాత వార్త:** పోచారం డివిజన్ జోడిమెట్లలో మండల యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వవైఖరికి నిరసనగా గురువారం ధర్నా నిర్వహించి ప్రభుత్వ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. పోచారం డివిజన్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు యుగేందర్ రెడ్డి ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం కొనసాగింది. ఈ సందర్భంగా యూత్ కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ నీట్ పరీక్ష నిర్వహణలో అవినీతికి పాల్పడిన కేంద్ర మంత్రి ధర్మేంద్రప్రధాన్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థులపై అనుమానుషంగా పోలీసులు ప్రవర్తించి లాఠీచార్జీ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి చంద్రిక, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బొమ్మక్ అజయ్, మేడ్చల్ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు తోటకూర రాహుల్ యాదవ్, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కె. వినోద్‌కుమార్, స్థానిక యూత్ కాంగ్రెస్ నాయకులు సాయిరామ్ గౌడ్, అఖిలేశ్, సంజీవరెడ్డి, శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.


కంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా పోచారం డివిజన్‌లో ధర్నా చేస్తున్న యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు.

## విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమా?

**కొత్తూర్, జులై 23, ప్రభాతవార్త:**

నీట్ సహా దేశవ్యాప్తంగా జరిగిన పోటీ పరీక్షల ప్రశ్నాపత్రాల లీకేజీలపై కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించాలని, విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడుతున్న కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ కొత్తూరులో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ నిరసన చేపట్టారు. విద్యార్థుల హక్కులకు మద్దతుగా పేపర్ లీకేజీలపై కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించిన ఏఐసీసీ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలను ఢిల్లీలో అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ మున్సిపాలిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు జుండగూడెం సుదర్శన్ గౌడ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఎల్లారం శేఖర్ రెడ్డి, పార్టీ సీనియర్ నేత వీరమోని దేవేందర్ ముదిరాజ్, కొత్తూరు మున్సిపాలిటీ, మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. దేశ భవిష్యత్తుగా భావించే విద్యార్థుల జీవితాలతో పేపర్ లీకేజీల రూపంలో కేంద్ర ప్రభుత్వం చెలగాటమాడుతోందని ఆరోపించారు. లక్షలాది మంది విద్యార్థులు సంవత్సరాల తరబడి కష్టపడి చదివి పరీక్షలకు హాజరవుతుంటే, ప్రశ్నాపత్రాల లీకేజీలతో వారి శ్రమ, సమయం, భవిష్యత్తు నష్టపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు గొంగళ్ల హరినాథ్ రెడ్డి, సీనియర్ నాయకులు వీరమొని దేవేందర్ ముదిరాజ్, కమ్మరి జనార్దన్ చారి, కర్రోళ్ల సురేందర్, ఎమ్మె సత్తయ్య, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు వన్నాడ శివశంకర్ గౌడ్, నాయకులు పెద్దిరెడ్డి రాజశేఖర్ రెడ్డి, ఆంజనేయులు గౌడ్, పీర్లగూడెం మహేష్ గౌడ్, ఎస్బీ పల్లి సురేష్, భరత్, పాశం కృష్ణ, ఎస్కే కాజా, చిలకమర్రి నరసింహ, జగన్, విజయపాల్ రెడ్డి, కూన శివకుమార్ గౌడ్, చింత సాయి తేజశ్వర్, పెంటయ్య, నరసింహ గౌడ్, బాలరాజు, రాజు, శివ, లక్ష్మయ్య, తిగాపురం ఆంజనేయులు, సుమన్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# టిపిసిసి పిలుపు మేరకు శాంతియుత నిరసనలు


అలియాబాద్ మున్సిపల్ కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు రాహుల్‌గాంధీని అరెస్ట్ చేయటాన్ని నిరసిస్తూ మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు తుంకి రమేశ్ ఆధ్వర్యంలో నిరసనలు తెలిపిన చైర్మన్‌లు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకుల దృశ్యం

**శామీర్‌పేట, జులై 23, ప్రభాతవార్త:**

లోకసభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీని, పలువురు కాంగ్రెస్ నేతలను అరెస్టులు చేయటాన్ని ఖండిస్తూ అలియాబాద్ మున్సిపల్ కేంద్రంలో, మూడుచింతలపల్లి మున్సిపల్ కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు శాంతియుత నిరసనల కార్యక్రమాన్ని నిర్వహించి నిరసనలు తెలియజేశారు. గురువారం శామీర్‌పేట మండలంలోని అలియాబాద్ మున్సిపల్ కేంద్రంలో మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు తుంకి రమేశ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు శాంతియుత నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. అలియాబాద్‌లోని అంబేద్కర్ విగ్రహం నుంచి బస్టాప్ వద్దకు కాంగ్రెస్ నాయకులు ర్యాలీగ వెళ్లి నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. నీట్ ప్రశ్నాపత్రాల లీకేజీ, అవతవకలు జరిగాయని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంధ్ర ప్రధాన్ రాజీనామా చేయాలంటూ కాంగ్రెస్ నాయకులు నినాదాలు చేశారు. ప్రజాస్వామ్యంలో ప్రతిపక్ష నాయకులపై అక్రమ అరెస్టులు, వేధింపులు ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమన్నారు. ప్రజల హక్కులు, రాజ్యాంగ విలువల పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ నిరంతరం పోరాటం కొనసాగిస్తుందన్నారు. అలియాబాద్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో అలియాబాద్ మున్సిపల్ చైర్మన్ కె.శిరీషకృష్ణారెడ్డి, మేడ్చల్ ఎఎంసి చైర్మన్ బి.నర్సింలుయాదవ్, జిల్లా ఆర్టీఏ మెంబర్ బి.జైపాల్‌రెడ్డి, మేడ్చల్ నియోజకవర్గ ఎ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు జి.వేణుగోపాల్‌రెడ్డి, అలియాబాద్ మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు తుంకి రమేశ్, మాజీ సర్పంచు కంటం కృష్ణారెడ్డి, ఎఎంసి డైరెక్టర్ తుంకి బిక్షపతి, మాజీ ఎంపిటిసి ఎస్.అశోక్‌రెడ్డి, మాజీ సర్పంచు ఎల మల్లేశ్, పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

**..మూడుచింతలపల్లిలో..శాంతియుత నిరసనలు..**

మూడుచింతలపల్లి మున్సిపల్ కేంద్రంలో లోకసభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీని, పలువురు కాంగ్రెస్ నేతలను అరెస్ట్ చేయటాన్ని నిరసిస్తూ మూడుచింతలపల్లి మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు దోసకాయల వెంకటేశ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు శాంతియుత నిరసనలు తెలియజేశారు. మున్సిపల్ కేంద్రంలో అంబేద్కర్ విగ్రహం వద్ద కాంగ్రెస్ నాయకులు నిరసనలు తెలియజేశారు. నీట్ ప్రశ్నాపత్రాల లీకేజీ అవతవకలు జరిగాయని, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంధ్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ నాయకులు నినాదాలు చేశారు. కేంద్ర ప్రభుత్వ తీరుపై కాంగ్రెస్ నాయకులు మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు దోసకాయల వెంకటేశ, మాజీ వైస్ఎంపిపి ఎం.శ్రీనివాస్‌రెడ్డి, మేడ్చల్ ఎఎంసి మాజీ వైస్‌చైర్మన్ ఇర్రి రవీందర్‌రెడ్డి, మాజీ ఎంపిటిసిలు, మాజీ సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు బి.జగన్నాథం, భస్వారెడ్డి, జైపాల్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, నర్సింలు, అనంతరెడ్డి, బి.వెంకటేశ, శ్రీనివాస్‌రెడ్డి, పి.బాలనర్సింహ్మా, ప్రభాకర్‌రెడ్డి, యాదగిరి, రాజేంద్రప్రసాద్, వేణగోపాల్‌రావు, పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## నీట్ పేపర్ లీక్ ఘటనపై కాంగ్రెస్ నిరసన..

**మొయినాబాద్, జులై 23, ప్రభాతవార్త :** ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ అరెస్టును నిరసిస్తూ.. నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ మొయినాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మొయినాబాద్ చౌరస్తా వద్ద భారీ నిరసన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ.. నీట్ పరీక్షలో జరిగిన అవకతవకలపై కేంద్ర ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడిన ఘటనకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి పదవికి రాజీనామా చేయాలని కోరారు. అదేవిధంగా, రాహుల్ గాంధీ అరెస్టును ప్రజాస్వామ్య విరుద్ధ చర్యగా అభివర్ణిస్తూ, రాజకీయ కక్షసాధింపులో భాగంగానే ఈ చర్యలు జరుగుతున్నాయని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. ప్రజాస్వామ్య విలువలను కాపాడాలని, కేంద్ర ప్రభుత్వం ప్రజల గొంతును అణిచివేసే చర్యలను విరమించాలని వారు డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సత్యనారాయణ, మున్సిపాలిటీ అధ్యక్షుడు విక్రంరెడ్డి, పీసీసీ నాయకుడు షాబాద్ దర్శన్, చంద్రారెడ్డి, గడ్డం వెంకట్ రెడ్డి, రామకృష్ణ గౌడ్, సంజీవరావు, కీసరి సంజీవరెడ్డి, పలగొల్ల అశోక్ యాదవ్, రవియాదవ్, జైపాల్ రెడ్డి, చిలుకూరు రాజు, బిక్షపతి, శివశంకర్ గౌడ్, బుర్రకాయల రమేష్, దయానంద్ గౌడ్, ఫిరంగి భాస్కర్, నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, యువ నాయకులు, కాంగ్రెస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## భర్త మందలింపుతో ఇంటి నుంచి వెళ్లిపోయిన మహిళ

**జవహర్‌నగర్, జులై 23,ప్రభాత వార్త:** జవహర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ మహిళ అదృశ్యమైన ఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శాంతినగర్ కాలనీకి చెందిన కోమటి కవిత (40), రాజయ్య భార్య. గత కొన్ని సంవత్సరాలుగా బాలాజీనగర్‌లో నివాసం ఉంటున్నారు.గత కొంతకాలంగా కవిత తరచూ ఫోన్‌లో మాట్లాడుతుండగా, దీనిపై భర్త రాజయ్య మందలించినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ఈ నెల 22న మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో కవిత ఇంటి నుంచి బయటకు వెళ్లి పోయింది.సాయంత్రం ఇంటికి వచ్చిన రాజయ్యకు భార్య కనిపించక పోవడంతో ఆమె సెల్‌ఫోన్‌కు పలుమార్లు కాల్ చేయగా స్విచ్ ఆఫ్ వచ్చినట్లు తెలిపారు. బంధువులు, పరిచయస్తుల వద్ద వెతికినా ఆమె ఆచూకీ లభించ లేదు.దీంతో రాజయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు జవహర్‌నగర్ పోలీ సులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కవిత ఆచూకీ తెలిసినవారు సమీప పోలీస్‌స్టేషన్‌కు లేదా జవహర్‌నగర్ పోలీసులను సంప్రదించాలని పోలీసులు కోరారు.



## నీటి సమస్యను పరిష్కరిస్తాం

**ఆమనగల్లు, జులై23, ప్రభాతవార్త:** ఆమనగల్లు పట్టణం కమలానగర్ కాలనీలోని ప్రభుత్వ పాఠశాలలో నెలకొన్న నీటి సమస్యను పరిష్కరిస్తామని మున్సిపాలిటీ ఛైర్మన్ నేనావత్ పత్యానాయక్ అన్నారు. ప్రభుత్వ బడుల బలోపేతం కొరకు కట్టుబడి ఉన్నామని, విద్యార్థుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. గురువారం మున్సిపాలిటీ కమిషనర్ రాఘవేందర్‌రెడ్డితో కలిసి ఛైర్మన్ పత్యానాయక్ పాఠశాలను సందర్శించారు. పాఠశాలలో నీటి సమస్య ఎదురవు



తుండడంతో నిర్వహకులు మున్సిపాలిటీ దృష్టికి తీసుకువచ్చారు. దీంతో స్పందించిన ఛైర్మన్ పత్య వెంటనే పాఠశాలను సందర్శించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నీటితో పాటు ఇతరత్ర సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. విద్యార్థుల హాజరుశాతం పెంపుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని, ప్రభుత్వ మెను ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలని కోరారు. నీటి సమస్యను పరిష్కరించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో కౌన్సిలర్‌లు అనూష, ఎర్రవోలు మహేశ్, మున్సిపాలిటీ మేనేజర్ ఆంజనేయులు, పాఠశాల ఉపాధ్యాయ బృందం తదితరులు ఉన్నారు.

## ఆలయ నూతన కమిటి ప్రమాణ స్వీకారం

**కుల్కచర్ల,జులై 23,ప్రభాతవార్త:** శ్రీ పాంబండ రామలింగేశ్వర స్వామి దేవాలయ అభివృద్ధికి సమిష్టిగా కృషి చేయాలని ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి అన్నారు. ఆలయ నూతన పాలక మండలి గురువారం ప్రమాణ స్వీకారం చేశారు.ఆలయ ఛైర్మన్‌గా కోట్ల మహిపాల్ రెడ్డి, ఈ ప్రమాణ మహోత్సవానికి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి పాల్గొన్నారు. ఆలయ ఛైర్మన్‌గా కోట్ల మహిపాల్ రెడ్డి,సభ్యులు నర్సింలు,ప్రభాకర్, లక్ష్మి, ఆంజిలయ్య,నర్సింలు,ఉదయ్ కిరణ్ ,అర్చకులు పాండు శర్మ, దశరథంతో దేవాదాయ శాఖ ఈఓ బాల నర్సయ్య ప్రమాణం చేయించారు.ఈ ప్రమాణ మహోత్సవానికి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి పాల్గొన్ని అలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి నూతన పాలక



ఆలయ నూతన పాలక మండలి సభ్యులతో ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి

మండలికి శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్బంగా ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ..ఈ ప్రాంతంలో ఎంతో పేరుగాంచిన దేవాలయంగా శ్రీ పాంబండ రామ లింగేశ్వర దేవాలయమని భకులు స్వామివారి దర్శనానికి అధిక సంఖ్యలో వస్తుంటారు.కనుక భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా రూపకల్పన చేయాలని పాలకమండలి సభ్యులకు సూచించారు.దేవాలయ అభివృద్ధికి పాటుపడాలని తెలిపారు.పదవి ఆకాక్షంతో కాకుండా దేవునికి సేవచేయాలనే దృక్పథంతో ఉండాలని కోరారు.ప్రతి సంవత్సరం బ్రహ్మోత్సవాలకు ఎలాంటి అటంకం కలగకుండా నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ ఛైర్మన్ భీంరెడ్డి,మార్కెట్ కమిటి ఛైర్మన్ ఆంజనేయులు,సర్పంచ్ మడుగు శ్రీనివాస్,మండల అధ్యక్షులు గోపాల్ నాయక్,చౌడపూర్ మండల అధ్యక్షులు చంద్రశేఖర్, మాజి ఎంపిపి సత్యహరిచందర్,సినియర్ నాయకులు కృష్ణ రెడ్డి,అయా గ్రామాల సర్పంచులు నాయకులు పెద్ద ఎత్తున్న పాల్గొన్నారు.

## నవోదయ ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకోండి : గోరేటి వెంకటేశం

**యాచారం, జులై 23, ప్రభాతవార్త:** భారత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన నవోదయ విద్యాలయ పాఠశాల ప్రవేశ పరీక్ష లను అర్హులైన విద్యార్థులందరూ అవకాశాన్ని సద్వినిగం చేసుకోవాలని నంది వనపర్తి బి ఆర్ ఎస్ పార్టీ సీనియర్ నాయకులు గోరటి వెంకటేశం అన్నారు. గురువారం యాచారం మండల పరిధిలోని పలు ప్రభుత్వ పాఠశాలలను వెంకటేశం సందర్శించి ఆయా పాఠశాలలోని ఐదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు నవోదయ విద్యాలయ పాఠశాల ప్రత్యేకతలను వివరించారు. విద్యాలయం గొప్పదనం అక్కడ ఉన్న పరిస్థితులను ప్రవేశ పరీక్షలకు కావాల్సిన సమాచారం తదితర అంశాలను వారికి తెలియజేశారు. గడువు చాలా తక్కువగా ఉందని తక్షణమే ప్రవేశ పరీక్ష కోసం ఆన్లైన్ ద్వారా అప్లై చేసుకోవాలని వారికి సూచన చేశారు. తను కూడా నవోదయ విద్యాలయంలో విద్యను అభ్యసించి ఉన్నత చదువులు చదివి ఉత్తమ స్థాయిలో ఉన్నానని నాలాగా అందరు కావాలని మంచి నైపుణ్యంతో గలిగిన విద్య లభిస్తుందని గుర్తు చేశారు.

## గణేశ్ ఉత్సవ సమితి కన్వీనర్‌గా రవీందర్‌గౌడ్



భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి సమావేశంలో మేడ్చల్ రూరల్ జిల్లా కన్వీనర్‌గా నూనెముంతల రవీందర్‌గౌడ్ నియమితులైనట్లు ప్రకటించిన భాగ్యనగర్ కమిటీ నాయకుల దృశ్యం

**శామీర్‌పేట, జులై 23, ప్రభాతవార్త:** భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి మేడ్చల్ రూరల్ జిల్లా కన్వీనర్‌గా నూనెముంతల రవీందర్‌గౌడ్ (తూంకుంట) నియమితులయ్యారు. గురువారం భాగ్యనగరంలో భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి నూతన కార్యాలయం ప్రారంభోత్సవం అనంతరం సమావేశం జరిగింది. దీనిలో భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి మేడ్చల్ రూరల్ జిల్లా కన్వీనర్‌గా నూనెముంతల రవీందర్‌గౌడ్‌ను భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ కమిటీ వారు డాక్టర్ రావి నూతుల శశిదర్, బుచ్చిరెడ్డిలు ఆయనను నియమించినట్లు ప్రకటించారు.

# చిన్నపాటి వర్షానికే కుప్పకూలుతున్న విద్యుత్ వ్యవస్థ

.. అధికారుల, సిబ్బంది నిర్లక్ష్యంతో ఆరు గ్రామాల్లో అంధకారం
..ఫోన్ చేసిన స్పందించని విద్యుత్ శాఖ ఏఈ
..విద్యుత్ సరఫరాను సక్రమంగా కొనసాగించేలా చర్యలు తీసుకోవాలి
.....సబ్‌స్టేషన్ వద్ద ఆందోళనకు దిగిన ఆయా గ్రామాల సర్పంచ్‌లు, నాయకులు



సబ్‌స్టేషన్ వద్ద ఆందోళన చేస్తున్న నాయకులు

**పెద్దేముల్, జులై 23, ప్రభాతవార్త:** దేవుడు వరమిచ్చిన పూజారి అడ్డుకున్నట్లు విద్యుత్ శాఖ అధికారుల, సిబ్బంది పరిస్థితి ఏర్పడింది. ప్రజాసంక్షేమ కోసం ప్రభుత్వం విద్యుత్ సరఫరాను సక్రమంగా అందిస్తుండగా, సంబంధిత అధికారుల నిర్లక్షం కారణంగా ప్రభుత్వానికి చెడ్డ పేరు తీసుకొస్తున్నారు. చిన్నపాటి వర్షం కురిసిన, స్వల్ప గాలులు వీచిన విద్యుత్ సరఫరా గంటల తరబడి నిలిచిపోవడం వల్ల పెద్దేముల్ మండలంలోని ఆరు గ్రామాల్లో ఆంధకారం నెలకొని ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సంబందిత విద్యుత్ సబ్‌స్టేషన్ అధికారులు, సిబ్బంది నిర్వహణలో నిర్లక్షం ప్రదర్శిస్తున్నారనే ఆరోపణలు గ్రామస్తుల నుంచి ఎదురవుతున్నాయి.పెద్దేముల్ మండలం మంబాపూర్ సబ్‌స్టేషన్ 33బై 11 కేవి నుంచి రుక్మాపూర్ ఫీడర్ ద్వారా ఖానాపూర్, చైతన్యనగర్, రెగొండి, కొండాపూర్, మదనంతాపూర్, రుక్మాపూర్ గ్రామాలకు విద్యుత్ సరఫరా అవుతుంది, అయితే కొద్దిపాటి వర్షం మొదలైతే చాలు కొద్ది సేపటికే విద్యుత్ సరఫరా ఆయా గ్రామాలకు నిలిపి వేస్తున్నారు. వర్షం ఆగిన తరువాత కూడా గంటల తరబడి వేచిచూసిన విద్యుత్ పునరుద్దరించకపోవడంతో ప్రజలు చీకట్లోనే కాలం గడుపవలసి వస్తుంది, విద్యుత్ అంతరాయం కారణంగా విద్యార్థుల చదువులు దెబ్బతింటుండగా, వృద్దులు, చిన్నారులు తీవ్ర ఇబ్బందులు పడవలసి వస్తుందని పలువురు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. దీంతో పాటు తాగునీటి సరఫరా నిలిచిపోవడంతో పాటు వ్యవసాయ బోర్లు పనిచేయక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొని నష్టాల పాలవుతున్నారు. అంతేగాకుండా ఎప్పుడు పడితే అప్పుడు ఎల్‌సి తీసుకోవడం వల్ల రైతాంగానికి తీవ్రంగా నష్టం వాటిల్లుతోంది. పలుమార్లు సబ్‌స్టేషన్‌కు పోన్ చేసిన స్పందన సరిగా ఉండక పోవడం, కొన్ని సార్లు పోన్లు కూడా ఎత్తడం లేదని ఆరోపిస్తు, విసిగి వేసారిన రెగొండి, చైతన్యనగర్, కొండాపూర్, మంబాపూర్ గ్రామాల గ్రామస్థులు. నాయకులు సర్పంచ్ అశోక్, ఇసాక్, బిచ్చన్న, శ్రీనివాస్, బండెన్న, లింగయ్య, జనార్ధన్, గోపాల్ తదితరులు గురువారం సబ్‌స్టేషన్ ముందు ఆందోళన వ్యక్తంచేశారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ ముందస్తు నిర్వహణ పనులను చేపట్టకపోవడం, చెట్ల కొమ్మలను తొలగించకపోవడం, లోపాలను వెంటనే సరిచేయకపోవడమే తరచు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతోందని వాపోయారు. ప్రజల ప్రాణాలు, ఆస్తుల భద్రతతో పాటు నిరంతర విద్యుత్ సరఫరా కల్పించాల్సిన భాద్యత ఉన్న అధికారులు తమ విధులను సమర్ధంగా నిర్వహించడంలో విఫలమవుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రతి చిన్న వర్షానికే ఇదే పరిస్థితి పునరావృతం కావడం అధికారుల పనితీరుపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయని అన్నారు. సంబందిత ఏఈకు పలుమార్లు పోన్ చేసిన లిప్ట్ చేయడని, ఆయన ఎక్కడ ఉంటాడో ఎవరికి అందుబాటులో ఉంటాడో తెలియడంలేదని మండిపడ్డారు. ఇంత నిర్లక్షం వహిస్తున్న సంబందిత ఏఈపై ఎందుకు చర్యలు తీసుకోవడంలేదని ఆందోళన వ్యక్తంచేశారు. నిర్లక్షంగా వ్యవహరిస్తున్న సంబందిత అధికారులపై, సిబ్బందిపై ఉన్నతాధికారులు విచారణ జరిపి భాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇట్టి విషయమై వివరణ కోరేందుకు సంబందిత ఏఈకు ఫోన్ చేసిన ఆయన పోన్ లిప్ట్ చేయలేదు.

# ఓటు హక్కు పరిరక్షణ బిఎల్‌ఎల బాధ్యత

**పెద్దేముల్, జులై 23, ప్రభాతవార్త:** ఓటు హక్కు పరిరక్షణ బిఎల్‌ఏల బాధ్యతని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. గురువారం తాండూరు క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అధ్వర్యంలో బిఎల్‌ఏలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్బంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సర్ కార్యక్రమంలో బిఎల్‌ఏలు కీలకపాత్ర పోషిస్తున్నారని, మిగతా 10 రోజులు కూడా మీ పాత్ర కీలకంగా ఉండాలని అన్నారు. ఓటు హక్కు భారత రాజ్యాంగంకల్పించిన అత్యంత విలువైన ప్రజాస్వామ్య హక్కు అని, అర్హత ఉన్న ఓటరు పేరు కూడా ఓటరు జాబితా నుంచి తొలగిపోకుండా ప్రతి బిఎల్‌ఏ అప్రమత్తంగా పనిచేయాలని అన్నారు. ఇంటింటికి వెళ్ళి ప్రజలకు సర్ ప్రక్రియపై అవగాహన కల్పిస్తు అవసరమైన దరఖాస్తులను సకాలంలో పూర్తి చేయించాలని అన్నారు.

ప్రతి బూత్, ప్రతి వార్డులో కాంగ్రెస్‌పార్టీ నాయకులు, కార్యకర్తలు, సమన్వయంతో పనిచేసి ప్రజల ఓటు హక్కును కాపాడాలని అన్నారు. ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడంలో ఖచ్చితమైన ఓటరు జాబితా ఎంతో కీలకమని, ఈ బాధ్యతను ప్రతి కార్యకర్త నిబద్దతతో నిర్వర్తించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ఎస్ఐఆర్ పర్యవేక్షకులు కోటం వినయ్‌రెడ్డి, మునిసిపల్ ఛైర్‌పర్సన్ పట్లోల్ల నీరజా బాల్‌రెడ్డి, వైస్ ఛైర్మెన్ అబ్దుల్ రజాక్, కాంగ్రెస్‌పార్టీ సర్ కన్వీనర్ పురుషోత్తంరావు, తాండూరు పట్టణ అధ్యక్షులు నాగరాజు, బిఎల్‌ఏలు, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి



మిత్రుని చిత్రపటానికి నివాళులర్పిస్తున్న తోటి క్లాస్మేట్స్

## మిత్రుని కుటుంబానికి ఆర్థిక సాయం

**తలకొండపల్లి, జులై 23, ప్రభాతవార్త:**

తలకొండపల్లి మండల పరిధిలోని గట్టు ఇప్పలపల్లి గ్రామానికి చెందిన ఏదుల శ్రీకాంత్ ఇటీవల అకస్మాత్తుగా మృతి చెందాడు. నాగర్ కర్నూల్ జిల్లా మిడ్జిల్ మండల కేంద్రానికి సిఎం రేవంత్ రెడ్డి వస్తున్న సందర్భంగా సమావేశానికి మండలం గట్టిపల్లి నుంచి మిడ్జిల్లో నిర్వహించే సిఎం సమావేశానికి వెళ్లిన ఏదుల శ్రీకాంత్ అక్కడే కింద పడిపోయి హైదరాబాదులో చికిత్స పొందుతూ అకస్మాత్తుగా మృతి చెందాడు . చిన్న వయసులో శ్రీకాంత్ మృతి చెందడం పట్ల 200607 సంవత్సరానికి చెందిన పదవ తరగతి అందరూ కలిసి గురువారం నాడు అతని కుటుంబసభ్యులను పరామర్శించారు. మృతుని ఇంట్లో అతని చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. అనంతరం మృతుని తల్లి ,అతని చెల్లికి వ్యక్తిగతంగా 47 వేల రూపాయల ఆర్థిక సాయం, 50 కేజీల బియ్యాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ తోటి మిత్రుడు శ్రీకాంత్ అకస్మాత్తుగా మృతి చెందడం తమను బాధించిందని, వ్యక్తిగతంగా తమ స్నేహితుని కుటుంబం ఆదుకునేందుకు ఆర్థిక సాయం చేస్తున్నట్లు ఈ సందర్భంగా వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో బొల్లె రమేష్ అమర్ సింగ్, విజయేందర్ కిరణ్ కొమ్మ రమేష్ శివశంకర్ రాఘవేందర్ తదితరులు ఉన్నారు.



విద్యార్థులకు షూ పంపిణీ చేస్తున్న సర్పంచ్ బాలయ్య

## పాఠశాల విద్యార్థులకు షూ పంపిణీ

**బంట్వారం,జులై 23, ప్రభాతవార్త:** మండల పరిధిలోని సల్బత్తాపూర్ గ్రామంలోని ప్రాథమిక ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం ద్వారా అందించబడుతున్న ఉచిత షూ ను గురువారం విద్యార్థులకు గ్రామ సర్పంచ్ బాలయ్య చేతుల మీదుగా అందించారు.

ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వ పాఠశాలల బలోపేతం పై దృష్టి సారించారని, నాణ్యమైన విద్యతోపాటు ఉచిత పాఠ్యపుస్తకాలు,షూ, బ్యాగులు, మధ్యాహ్న భోజనం, అల్పాహారం ప్రభుత్వం ద్వారా అందించబడుతుందని అన్నారు.

ఈ అవకాశాన్ని ప్రతి విద్యార్థి వినియోగించుకోవాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే పేద విద్యార్థులకు ఉచితంగా షూ అందించడం చాలా గొప్ప విషయమని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగజ్యోతి, ఉపాధ్యాయులు వెంకటేశం, విశాల్, అమ్మ ఆదర్శ పాఠశాల అధ్యక్షురాలు శశికళ, వార్డ్ మెంబర్లు తదితరులు పాల్గొన్నారు.

## కాలు జారితే కైలాసానికే ..

-కాంట్రాక్టర్ పై 12వ వార్డు కౌన్సిలర్ వారాల రవీంద్ర మండిపాటు..

**పరిగి టౌన్, జులై 23, ప్రభాతవార్త :**

పరిగి మున్సిపల్ పరిధిలో 12వ వార్డు టీచర్స్ కాలనీలో అమృత్ 2.0 వాటర్ ట్యాంక్ నిర్మాణంలో భాగంగా కాంట్రాక్టర్ ఎలాంటి అనుమతులు లేకుండా ఇష్టానుసారంగా పనిచేస్తూ కాలనీ రోడ్లను బురద మాయంగా చేసి కాలనీవాసులకు రాకపోకలకు ఇబ్బందులుకు గురి చేస్తున్నారు. విద్యార్థులు పాఠశాలకు వెళ్లాలంటే చాలా ఇబ్బందికరంగా మారింది. అలాగే మోటార్ సైకిల్ వెళ్లాలంటే ఇబ్బందికరంగా పాఠశాల బస్సులు వెళ్లడానికి కూడా ఇబ్బందిగా ఉందని 12వ వార్డు కౌన్సిలర్ వారాల రవీంద్ర మండిపడ్డారు.అసలు పైప్ లైన్ ఈ రూట్లో వేయడానికి అనుమతి లేదు అయినా వారు ఎలాంటి పర్మిషన్ లేకుండా పైప్ లైన్ వేస్తున్నారని వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు మరియు 12వ వార్డు కౌన్సిలర్ కోరారు.



కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో బురదమయంగా మారిన రోడ్డు



రెడ్ క్రాస్ సొసైటీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న తహసిల్దార్ రాజేందర్ రెడ్డి

## రెడ్ క్రాస్ సొసైటీ సభ్యత్వ నమోదు వేగవంతం చేయాలి

**కేశంపేట, జులై 23, ప్రభాతవార్త :**మండల పరిధిలో రెడ్ క్రాస్ సొసైటీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేయడానికి ప్రత్యేక సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు .ఈ కార్యక్రమాన్ని. బిజెపి సీనియర్ నాయకుడు కర్రెడ్ల నరేందర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగిందని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమాన్ని స్థానిక తహసిల్దార్ రాజేందర్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి హైదరాబాద్ రెడ్ క్రాస్ సొసైటీ ఛైర్మన్ మామిడి భీమ్ రెడ్డి పాల్గొని, రెడ్ క్రాస్ సొసైటీ అందిస్తున్న మానవతా సేవలను వివరించారు. సమాజ సేవలో భాగంగా ప్రతి ఒక్కరూ రెడ్ క్రాస్ సొసైటీ సభ్యత్వాన్ని తీసుకుని సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని ఆయన పిలుపు నిచ్చారు.ఈ కార్యక్రమంలో , తదితరులు పాల్గొని సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. కేశంపేట్ మండలంలో సభ్యత్వ నమోదును మరింత విస్తృతంగా చేపట్టి, ఎక్కువ మంది యువత, ప్రజలను రెడ్ క్రాస్ సేవా కార్యక్రమాల్లో భాగస్వాములను చేయాలని నిర్వాహకులు తెలిపారు.

## యువ చైతన్య వేదిక అద్భుతం : మోటే శ్రీశైలం

**యాచారం, జులై 23, ప్రభాతవార్త :** యువ చైతన్య వేదిక కార్యక్రమం అద్భుతంగా జరిగిందని యాచారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మోటెస్ శ్రీశైలం అన్నారు. గురువారం ఇబ్రహీంపట్నం ఎమ్మె ల్యే మల్ రెడ్డి రంగారెడ్డి తనయుడు అభిషేక్ రెడ్డి జన్మదిన సందర్భంగా యువ చైతన్య వేదిక కార్యక్రమం ఘనంగా నిర్వహించేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి యాచారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మోటి శ్రీశైలం ఆధ్వర్యంలో హాజరైనారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మోటే శ్రీశైలం మాట్లాడుతూ.. జన్మదిన వేడుకలకు ఆర్బాటాలకు పోకుండా యువతను సన్మార్గంలో నడిపించేందుకు ఉన్నత అధికారులను మానసిక వైద్యం సామాజిక స్పృహ గల భక్తులను తీసుకువచ్చి యువతను మేల్కొల్పే కార్యక్రమం చేపట్టడం చాలా గర్వంగా ఉందని అన్నారు. కార్యక్రమంలో వక్తలు, ఉన్నతాధికారులు నేటి సమాజం తీరు పరిస్థితులను కళ్ళకు కట్టినట్టుగా వివరించారు. యువ చైతన్య వేదిక కార్యక్రమానికి హాజరైన 2000 మంది యువత అంశాలు మనసుకు కొంతవరకు చేరుకోవడం వారికి అర్థమయ్యే విధంగా బోధించడం ఎంతో సందేశాత్మకంగా ఉండడం అద్భుతమైన కార్యక్రమంగా జరిగిందని ఆయన కొనియాడారు. యువతను నైపుణ్యం శిక్షణ స్వయం ఉపాధి సంబంధిత అంశాలపై చర్చ జరగడం ఎంతో అద్భుతంగా ఉందని అన్నారు.

# ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు దుస్తుల పంపిణీ

**తలకొండపల్లి, జులై 23, ప్రభాతవార్త:**

తల కొండపల్లి మండల కేంద్రంలో మిషన్ భగీరథ రాష్ట్ర మాజీ వైస్ చైర్మన్, మాజీ జెడ్పిటిసి ఉప్పల వెంకటేష్ నిర్మించిన ఉప్పల ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు గురువారం నాడు ఉచితంగా దుస్తులు పంపిణీ చేశారు. నూతనంగా ఏర్పాటు చేసి నిర్వహిస్తున్న ఉప్పల ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న 400 మంది విద్యార్థినిలకు ఉచితంగా దుస్తులు అందజేశారు. ఇటీవల రూ .10కోట్లు వెచ్చించి తల్లిదండ్రులు లేని బాలికల కోసం ఉప్పల వెంక టేష్ ఉప్పల ఆశ్రమ పాఠశాలను నిర్మించారు. పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు దుస్తులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ వెంకటేష్ కుటుంబ సభ్యులు గ్రామ సర్పంచ్ కటికల శేఖర్ యాదవ్, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.



విద్యార్థులకు దుస్తులు పంపిణీ చేస్తున్న నాయకులు

# మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత

**కేశంపేట, జులై 23, ప్రభాతవార్త:**

కేశంపేట మండల పరిధిలోని భోదునం పల్లి గ్రామానికి.. చెందిన కుమ్మరి రామయ్య, గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ గురువారం తెల్లవారుజామున మృతి చెందాడు. విషయం తెలుసుకున్న విషయం తెలుసుకున్న గ్రామ సర్పంచ్ అదిరి నాగేశ్వర్ కేశంపేట మాజీ జెడ్పిటిసి విశాల శ్రావణ్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లగా వెంబడే స్పందించిన ఆమె మృతుడి కుటుంబానికి 5000 వేల రూపాయలను , గ్రామ సర్పంచ్ ఎదిరే నాగేశ్వర్ 3000 వేల రూపాయలు, 1 వ వార్డు సభ్యుడు ఎదిరే బీరప్ప 2000 వేల రూపాయలు మొత్తంగా కలిపి 10,000 వేల రూపాయలను మృతుడి కుమారుడైన కుమ్మరి రమేష్ కు అందజేశారు. ఆర్థిక సహాయం ఆర్థిక సహాయం అందజేసిన కాంగ్రెస్ నాయకులకు మృతుడి కుటుంబ సభ్యులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఎదిరే అంజయ్య, వార్డు సభ్యులు ఎదిరే బీరప్ప, పిప్పళ్ళ నరేందర్, నాయకులు ఎదిరే ఆంజనేయులు, మెలిగిరి యాదగిరి, ఎదిరే అంజనేయులు, ఎదిరే వెంకటేష్, బాయి గద్ద మహేష్, ఎదిరే వెంకటయ్య, కుమ్మరి నరసింహ, ఎదిరే చెన్నయ్య, చాకలి బాల్ రాజ్ , గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# నందిగామ ఇన్స్పెక్టర్ పి ప్రసాద్ బదిలీ

కొత్త ఇన్స్పెక్టర్ బి వీరబాబు బాధ్యతలు స్వీకరణ

**నందిగామ, జులై 23, ప్రభాతవార్త :** నందిగామ పోలీస్ స్టేషన్లో ఇన్స్పెక్టర్‌గా పనిచేసిన పి ప్రసాద్ బదిలీపై వెళ్లిన సందర్భంగా గురువారం పోలీస్ కార్యాలయ సిబ్బంది ఘనంగా వీడుకోలు పలికారు . సిసిఆర్ బి ఫ్యూచర్ సిటీ నుడి కొత్తగా వచ్చిన బి వీరబాబు పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్బంగా కార్యాలయ పోలీస్ సిబ్బంది ఇరువురి ఇన్స్పెక్టర్లను పూలమాలలు వేసి శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో సబ్ ఇన్స్పెక్టర్ దేవరాజ్, ఏఎస్ఐ శ్రీనివాస్, హెడ్ కానిస్టేబుల్ లు వెంకటాచారి, వెంకట్ నాయక్, రెడ్యా నాయక్, హనుమత్ నాయక్, కానిస్టేబులు శ్రీకాంత్, శ్రీనివాసులు, శ్రీశైలం, రమేష్, శబరి, చంద్రకళ, యామిని, సంతోష తదితరులు పాల్గొన్నారు.

**ఇన్స్పెక్టర్ ప్రసాద్ సేవలు మరువలేనివి**

అటు పోలీసు వృత్తిలో.. ఇటు సామాజి వికాసంలో జనం మెప్పు పొందిన ఇన్స్పెక్టర్ ప్రసాద్ బదిలీపై వెళ్లిన ఇన్స్పెక్టర్ సేవలను కొనియాడిన పోలీస్ సిబ్బంది.

**కంటతడి పెట్టిన కానిస్టేబుల్**

ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు సర్వసాధారణమే. అందులో పోలీసు వృత్తి కఠినతరమైనది. వృత్తిపరంగా విధులు నిర్వహించి ప్రజల మన్ననలను పొందడం అంటే అంత ఆశామాషి కాదు. నందిగామ మండల పోలీస్ స్టేషన్లో ఇన్స్పెక్టర్ గా ప్రసాద్ రెండున్నర సంవత్సరాలు రాజి పడని విధంగా పనిచేసి వృత్తిపరంగా, సమాజ పరంగా సేవలందించి పోలీసు శాఖకు పన్నె తేవడంలో ఇన్స్పెక్టర్ ప్రసాద్ ఈ ప్రాంత ప్రజల మనస్సులను చూరగొన్నారు. గురువారం బదిలీపై వెళ్తున్న సందర్బంగా ఆయనకు మండల పోలీస్ సిబ్బంది పూలమాలలు వేసి శాలువాతో సన్మానించారు. పోలీస్ స్టేషన్లో రైటర్ గా పనిచేసే కానిస్టేబుల్ ఉద్వేగంగా కంట తడిపెట్టుకొన్నారు. సన్మానించిన వారిలో ఎస్సై దేవరాజ్, ఏఎస్ఐ శ్రీనివాస్, హెడ్ కానిస్టేబుల్ వెంకటచారి,వెంకట్ నాయక్ ,హనుమంత్ నాయక్, రెడ్యా నాయక్,పోలీస్ సిబ్బంది,




బదిలీపై వెళ్లిన ఇన్స్పెక్టర్‌ను సన్మానించిన పోలీస్ సిబ్బంది

## చేవెళ్ల నూతన సిఐగా నరేందర్ రెడ్డి

-చేవెళ్ల సిఐ భూపాల్ శ్రీధర్ బదిలీ

**చేవెళ్ల, జులై 23, ప్రభాతవార్త :** చేవెళ్ల నూతన సిఐగా నరేందర్‌రెడ్డిని నియమిస్తూ,చేవెళ్ల సిఐగా పని చేస్తున్న భూపాల్ శ్రీధర్ బదిలీని చేస్తూ ఫ్యూచర్ సీటీ పోలీస్ కమీషనర్ తరుణ్ జోషీ ఉత్తర్వులు జారీ చేశారు.ఫ్యూచర్ సీటీ పోలీస్ పోలీస్ కమీషనరేట్ పరిదిలో పలువురు సిఐలు బదిలయ్యారు. శంషాబాద్ సిఐ నరేందర్‌రెడ్డిని చేవెళ్ల సిఐగా, చేవెళ్ల సిఐ శ్రీధర్ భూపాల్‌ను సీసీఆర్‌బీకి, సీపిఓలో విఆర్ సిఐ డికె లక్ష్మారెడ్డిని షాబాద్ సిఐగా బదిలీ చేశారు. విఆర్ సిపిఓ సిఐ జి.రుద్వీర్ కుమార్‌ను శంకర్‌పల్లి సిఐగా, సిసిఆర్‌బి సిఐ బి.వీరాబాబును నందిగామ సిఐగా బదిలీ

బిఆర్ఎస్ సీనియర్ నేతలు కాట్న రవీందర్,రమేష్ గౌడ్, బుగ్గోనిగూడ సర్పంచ్ సాలయ్య,చేగూర్ వార్డు సభ్యులు మంచపల్లి భాస్కర్,అంతిరెడ్డి గూడ సర్పంచ్ గడ్డల మంజుల భర్త యాదగిరి,సిడి తండా మాజీ సర్పంచ్ జటావత్ రాజునాయక్,కాంగ్రెస్ సీనియర్ నేత రవి నాయక్ తదితరులు పాల్గొన్నారు.